
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 12 నవంబరు 2024



# తవ్వేస్తున్నారు..?!

- పురాతన ఆలయాలు.. కట్టడాలే లక్ష్యం
- రెచ్చిపోతున్న గుప్తనిధుల ముఠా
- ధ్వంసమవుతున్న ప్రాచీన కట్టడాలు

గుర్రంకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల ముఠా సభ్యుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. పురాతన ఆలయాలు, కట్టడాలే లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేస్తున్నారు. ఈ పురాతన కట్టడాలు, ఆలయాల్లో నిధులు ఉన్నాయని ముఠా సభ్యులు తవ్వేస్తున్నారు. గుర్రంకొండను పూర్వం విజయనగర సామ్రాజ్యులు, నవాబులు పాలించారు. ఇందులో భాగంగా శ్రీకృష్ణదేవరాయులు, టిప్పుసుల్తాన్ వంటి గొప్ప రాజులు, నాయకులు గుర్రంకొండను పాలించారని పురాణాలు చెబుతున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న గుర్రంకొండలో పాలకులు తమ పాలన గుర్తుండేలా చారిత్రక కట్టడాలతో పాటు ఆలయాలను నిర్మించారు. ప్రాచీన కట్టడాలలో గుప్తనిధులు ఉన్నాయన్న ఆశతో గుప్త నిధుల ముఠా సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా తవ్వేస్తున్నారు. వీరి ఆగడాలకు పవిత్రమైన ఆలయాలు, విగ్రహాలు, కట్టడాలు, సమాధులను నాశనం చేస్తున్నారు.



కోట సమీపంలో గుప్తనిధుల కోసం తవ్విన సొరంగ మార్గం

### మీర్ రజా అలీఖాన్ సమాధి ధ్వంసం

గుర్రంకొండను మైసూర్ రాజులైన మీర్‌రజా అలీఖాన్ పరిపాలించారు. ఆయన టిప్పుసుల్తాన్‌కు మేనమామ. ఆయన పాలనలో టిప్పుసుల్తాన్‌ను గుర్రంకొండలో ఉంచుకుని విద్యాబుద్ధులను నేర్పించారు. ఆయన మరణాంతరం ఖండ్రిగలో ఖననం చేశారు. మీర్ రజా అలీఖాన్ సమాధిని రెండంతస్తులతో నిర్మించారు. కింద అంతస్తులో పూర్వీకుల సమాధులను వేశారు. రెండవ అంతస్తులో మీర్ రజా అలీఖాన్ సమాధిని నిర్మించి చుట్టూ పెద్ద డూమ్‌ను నిర్మించారు. ఈ డూమ్‌లోకి ప్రవేశించడానికి తూర్పు వైపున ఓ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఈ ద్వారం ద్వారానే ఎవరైనా లోపలికి వెళ్లి రావాలి. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం గుప్త నిధుల ముఠా సభ్యులు మీర్ రజా అలీఖాన్ సమాధిని తవ్వేశారు. సమాధి పైనుంచి సుమారు 20 అడుగుల లోతు వరకు తవ్వి మట్టిని లోపలే వేశారు. గమనించిన స్థానికులు, మతపెద్దలు గుప్త నిధుల తవ్వకాలపై పోలీసులకు తెలిపారు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా తవ్వకాలకు పాల్పడిన 9 మందిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు.

### ఆంజనేయస్వామి ఆలయం ధ్వంసం

గుర్రంకొండ పట్టణానికి కూత వేటు దూరంలో తుపాకులచెరువు వద్ద ఆయకట్టు పొలాల్లో ఉన్న పురాతన ఆంజనేయస్వామి ఆలయాన్ని గత నెల 21వ తేదీ బయట రాష్ట్రాల నుంచి మాంత్రికులను పిలిపించి పూజలు చేయించి ఎక్స్‌కవేటర్‌తో ఆలయం ముందున్న మండపాన్ని ఓవైపు ధ్వంసం చేశారు. మండపం తొలగించిన ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో సుమారు 20 అడుగుల లోతు గుంతను తవ్వారు. ఈ తతంగమంతా పగటి పూట చేయడంతో రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడకు చేరుకునేలోపే ముఠా సభ్యులు పరారయ్యారు.

### ముఠా సభ్యులకు స్థానికుల అండ..?!

గుప్త నిధుల ముఠా సభ్యులకు స్థానికులు అండగా అన్ని చోట్ల ఉన్నారు. దీంతో ముఠా సభ్యులు వారి అండతో పక్కాగా ప్రణాళిక వేసి తవ్వకాలను చేపడుతున్నారు. మగ్బీరాలోని మీర్‌రజా అలీఖాన్ సమాధి వద్ద జరిపిన నిధుల తవ్వకాల ముఠా సభ్యులలో టిప్పుసుల్తాన్ కుటుంబానికి చెందిన వారసుడు ఉండడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. అలాగే తుపాకుల చెరువు వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో జరిపిన తవ్వకాల్లో గ్రామానికి చెందిన కొందరు ఉండడం విశేషం. ఇలా గుప్త నిధుల ముఠా సభ్యులు స్థానికుల అండదండలతో పురాతన ఆలయాలు, కట్టడాలు, సమాధులను ధ్వంసం చేస్తున్నారు.



మగ్బీరలో గుప్త నిధుల కోసం తవ్విన మీర్ రజా అలీఖాన్ సమాధి

### ప్రశ్నార్థకంగా ముఠా సభ్యుల అరెస్టు..?

గుర్రంకొండ పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న తుపాకుల చెరువు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గత నెల 21వ తేదీ ముఠా సభ్యులు తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల కోసం ఎక్స్‌కవేటర్, రెండు కార్లను ఉపయోగించారు. ఈ ఘటనపై పోలీసులు ఏడుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులను ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడంతో హిందూ సంఘాల నేతలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన నిందితుల కార్లను గుట్టుచప్పుడు కాకుండా పది రోజుల క్రితం రాత్రి పూట ఊరు దాటించేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో నిందితులందరూ ఒక వర్గానికి చెందిన వారు కావడంతో మరో వర్గం వారు తమకు న్యాయం చేయడం లేదని ఆందోళన చెందుతున్నారు.

### గుప్త నిధుల ముఠా సభ్యులను త్వరలోనే అరెస్టు చేస్తాం..

గుర్రంకొండ పరిసరాలలో గుప్త నిధుల తవ్వకాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచాం. అంతేకాకుండా రాత్రి పూట అనుమానంగా తిరిగే వారిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నాం. పురాతన కట్టడాలు, ఆలయాలను ముఠా సభ్యులు తవ్వకుండా తగు చర్యలు తీసుకొంటున్నాం. అలాగే ఆంజనేయస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన నిందితులపై కేసు నమోదు చేసి గాలిస్తున్నాం. త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తాం.

- మధురామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ

### మూలవిరాట్ విగ్రహాన్ని పెకిలించారు..

గుర్రంకొండ కోటలో విజయనగర సామ్రాజ్యులు లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం పశ్చిమ దిశ వైపు ముఖద్వారం ఉండడం విశేషం. ఆలయంలో గుప్తనిధులు ఉన్నాయని ముఠా సభ్యులు ధ్వజస్తంభం పీటను ధ్వంసం చేశారు. తరువాత కొద్ది నెలలకు ఆలయంలో చొరబడి స్వామి వారి విగ్రహాన్ని పెకిలించి ధ్వంసం చేశారు. ఆలయం ఎదుట ఉన్న ధ్వజస్తంభాన్ని కూడా గుప్త నిధుల కోసం పగులకొట్టారు.


- గుర్రంకొండ కోట సమీపంలోని సొరంగ మార్గంలో గుప్తనిధులు ఉన్నాయని మట్టితో పూడిపోయిన సొరంగ మార్గాన్ని ముఠా సభ్యులు తోడారు. అందులో దీపాలను ఏర్పాటు చేసి గుప్త నిధుల కోసం పూజలు చేశారు.
- ఎల్లుట్ల అటవీ ప్రాంతంలోని మల్లాలమ్మ ఆలయ సమీపంలోని కుమ్మి వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలను జరిపిన ఏడుగురు ముఠా సభ్యులను గత ఏడాది చివరిలో పోలీసులు అరెస్టు చేశారు. అలాగే ఎల్లుట్ల పంచాయతీలోని నగిరి సమీపంలో ఉన్న శివాలయంలో శివలింగాన్ని పెకిలించి వేశారు.
- గుర్రంకొండ ప్రభుత్వాస్పత్రి సమీపంలోని బురుజులో గుప్తనిధులు ఉన్నాయని నాశనం చేశారు.
- అమిలేపల్లె అటవీ ప్రాంతంలో ఉన్న పాండవ గుహల్లో సైతం గుప్తనిధులు ఉన్నాయని బండను పగులగొట్టి గుప్తనిధుల కోసం అన్వేషించారు. ఇలా మండలంలో గుప్తనిధుల ముఠా సభ్యులు నిధుల వేటలో ఆలయాలతో పాటు చారిత్రక కట్టడాలను ధ్వంసం చేస్తున్నారు. ఈ ముఠా సభ్యులు పురాతన కట్టడాలపై రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. అధికారులు చొరవ చూపి ఆలయాలు, కట్టడాలు ధ్వంసం కాకుండా నిఘా పెంచాల్సి ఉంది.



తుపాకుల చెరువు వద్ద తవ్విన ఆంజనేయస్వామి ఆలయం (ఫైల్)

## న్యుమోనియా లేని సమాజ స్థాపనే లక్ష్యం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య



రాయచోటిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): న్యుమోనియా వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించడమే వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉషశ్రీలు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో డీఎంహెచ్‌వో మీడియాతో మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా ప్రజలకు దానిపై అవగాహన కల్పించాలన్నారు. ఊపిరితిత్తులలో అసాధారణ, ద్రవం చేరడం వల్ల శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది కల్గించే పరిస్థితిని న్యుమోనియా అంటారని, దీనినే ఊపిరితిత్తులలో నెమ్ము చేరడం అంటారన్నారు. ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు సాన్స్ (న్యుమోనియా లక్షణాలను త్వరగా గుర్తిద్దాం పిల్లల బాల్యాన్ని ఊపిరి పీల్చుకోనిద్దాం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. ఇంటింటికి వెళ్లి 5 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి వారికి లక్షణాలు ఉంటే పీహెచ్‌సీ వైద్యాధికారికి రెఫర్ చేస్తారన్నారు. ఎక్కువ సమయం పొగ పీల్చడం, వాతావరణంలో మార్పులు, చాలా తక్కువ వ్యాధి నిరోధక స్థాయి కలిగి ఉండటం, పౌష్టికాహారం సరిగ్గా తీసుకోకపోవడం, బిడ్డకు సరైన వెచ్చదనం కల్గించకపోవడం తదితర కారణాలు ఉన్నాయన్నారు. ప్రధానంగా న్యుమోనియా లక్షణాలు జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో పక్కటెముకలు కదలడం, అధిక జ్వరం, ఆకలి మందగించడం, గుండెదడ, నిద్రమత్తు, ఛాతి కొట్టుకోవడం, అధిక బద్ధకం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ న్యుమోనియాపై అవగాహన పెంచుకు న్యుమోనియా లేని సమాజాన్ని ఏర్పరచుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యా వ్యవస్థకు పునాది అబుల్‌కలాం ఆజాద్

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశ విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో భారతరత్న, భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ మైనార్టీల సంక్షేమ దినోత్సవ వేడుకలను జిల్లా మైనార్టీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్‌కలాం ఆజాద్ యూజీసీ, ఐఐటీ, ఐఐఎంల స్థాపనలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రజలందరికీ ఉచితంగా విద్య అందాలని ఆయన కోరుకున్నారన్నారు. విద్యావ్యవస్థకు పునాదులు వేయడమే కాకుండా భారతదేశంలో మతసామరస్యానికి కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో మైనార్టీలకు విశేష సేవలు అందించిన షాకీర్ తదితరులకు మెమెంటోలు అందించి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమశాఖ సిబ్బంది, జిల్లాలోని మైనార్టీల నాయకులు, మైనార్టీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

## మల్లయ్యకొండకు కార్తీక శోభ

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

తంబళ్లపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. రెండో కార్తీక సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు మలయ్యకొండకు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాకుండా రాయలసీమ జిల్లాలలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో కొండ మొత్తం భక్తులతో కిటకిటలాడింది. ఓం నమఃశివాయ, హర హర మహాదేవ.. శంభో శంకర.. అంటూ భక్తులు శివన్నామస్మరణ చేసుకుంటూ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఈశ్వరప్ప స్వామి వారిని నాగాభరణంతో విశేషంగా అలంకరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరీ వ్రత నోములు నోచుకున్నారు. ఆలయం ముందు ధ్వజస్తంభం వద్ద పెద్దఎత్తున దీపాలు వెలిగించారు. మల్లయ్యకొండ పైన భక్తులకు ఆలయ ఈవో మునిరాజ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం మల్లయ్యకొండ పైకి ఆర్టీసీ బస్సులను నడిపారు.



ఆలయం ముందు దీపాలు వెలిగిస్తున్న మహిళలు



స్వామి వారిని దర్శించుకోవడానికి క్యూలో ఉన్న భక్తులు

## బద్వేలులో ఉద్రిక్తత..

- స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ
- స్థానికులపై స్థానికేతరుల దౌర్జన్యం
- రూ.కోట్ల విలువచేసే స్థలం మాదంటే మాదంటూ బాహాబాహి...
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ




భూవివాదంలో ఘర్షణ పడుతున్న దృశ్యం

బద్వేలుటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో మడకలవారిపల్లె పంచాయతీ సర్వేనెంబర్ 809లో 5.07ఎకరాల భూమి తమదంటూ జమ్మలమడుగుకు చెందిన కొందరు వ్యక్తులు ఎక్సకవేటర్ తీసుకువచ్చి కంపచెట్లను తొలగించి పనులు మొదలుపెట్టారు. ఇది తెలుసుకున్న స్థానికంగా ఉన్న కొందరు అక్కడికి చేరుకుని ఆ భూములు తాము కొన్నామని, తమ పేరుతో రిజిస్ట్రేషన్ ఉందని చెప్పారు. అయినా వారు వినకుండా ఎక్సకవేటర్‌తో దౌర్జన్యంగా చదునుచేసేందుకు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. చివరకు పోలీసుల రంగప్రవేశంతో ఘర్షణ సర్దుమణిగింది. వివరాలిలా..

కాగా.. 809 సర్వేనెంబర్‌లో 2.5 ఎకరాల భూమి నూనె రాజేశ్వరిపేరుతో ఆన్‌లైన్‌లో ఉందని, వారి వద్ద నుంచి కొనుగోలు చేశామని, వాటి ఆధారంతో ఈ భూమిలో పనులు ప్రారంభించేందుకు వచ్చామని జమ్మలమడుగు, కమలాపురానికి చెందిన వారు చెప్పారు. నాటి తహశీల్దారు మామూళ్లు తీసుకుని నూనె రాజేశ్వరి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించడంతో అప్పట్లోనే ఘర్షణ నెలకొంది. తరువాత అసలైన హక్కుదారులు కలెక్టర్‌ను ఆశ్రయించి ఆన్‌లైన్‌లో నమోదు అయిన పేరును రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ పరిశీలించి సిఫారసు చేయడంతో అప్పటి నుంచి ఆ భూమిలో వివాదం రాలేదు. లబ్ధిదారులు క్రయవిక్రయాలు జరుపుకుంటూ వచ్చారు. ఊహించని విధంగా సోమవారం జమ్మలమడుగు, కమలాపురానికి చెందిన కొందరు వ్యక్తులు రావడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. మాది జమ్మలమడుగు. మేము ఆదినారాయణరెడ్డి మనుషులం. ఈ భూమి మాది అంటూ.. కొంతమంది ఆదినారాయణరెడ్డి పేరుచెప్పి హల్‌చల్ చేశారు. దాదాపు 10వాహనాల్లో సుమారు 100మంది వ్యక్తులు పథకం ప్రకారం సినీ ఫక్కీలో దౌర్జన్యానికి దిగారు. లబ్ధిదారులు అడ్డుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో.. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు కాగితాలను పరిశీలించి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ఇరువర్గాలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ అనిత



## ఉత్తమ సేవలకు రాష్ట్ర స్థాయి అవార్డు

- సీఎం నుంచి అవార్డు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

కలకడ/పెద్దమండ్యం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వృత్తిలో తాము కనబరచిన ఉత్తమ సేవలకు సీఎం చంద్రబాబునాయుడు నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. కలకడ కస్తూర్బా ప్రిన్సిపాల్ ఎ.అనిత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఈమె స్థానిక కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మునీంద్రానాయక్, ఎంఈవో-2 రామచంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను అభినందించారు. కాగా పెద్దమండ్యం మండలం సిద్దవరం కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు నాగరత్న సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. పెద్దమండ్యం మండల ఎంఈవో మనోహర్, రామకృష్ణ, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు హర్షం వ్యక్తం చేశారు.



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాగరత్న

## ప్రజల సమస్యలను పరిష్కరించాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదనరావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

# హరికథే.. జీవనం

**● దేశవ్యాప్తంగా 10,623 సార్లు హరికథాగానం ● హరికథకు జీవం పోస్తున్న యడవల్లి రమణయ్య భాగవతార్**

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆయన హరికథ చెబితే మైమరచి పోవాల్సిందే. మధ్య మధ్యలో ఆయన చెప్పే పిట్టకథలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయి. 40 ఏళ్లుగా పదివేల సార్లకు పైగా హరికథాగానం చేశారు.. ఆయనే యడవల్లి రమణయ్య భాగవతార్. హరికథతోపాటు ఇతర కళలు నేర్చుకుని బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. రమణయ్య తండ్రి చిన్న కుళాయప్ప పగటి వేషాలు వేసేవారు. కుటుంబ పోషణకోసం కర్నూలు జిల్లా నందికొట్కూరు నుంచి దువ్వూరు మండలం మీర్జాన్‌పల్లెకు చేరుకున్నారు. చిన్నకుళాయప్పకు ఆరుగురు సంతానం కాగా రమణయ్య భాగవతార్ మూడవవారు. మూడవ తరగతి వరకే చదివిన ఆయన ఏడేళ్ల వయస్సులోనే కొండపల్లి దుర్గయ్య వద్ద సంగీతం నేర్చుకున్నారు. సినిమా పాటలు పాడుకుంటూ ఉండేవారు.



హరికథ చెబుతున్న రమణయ్య భాగవతార్ (ఫైల్)

### బహుముఖ ప్రజ్ఞాశాలి

తండ్రితోపాటు తన సోదరులు కళాకారులు కావడంతో రమణయ్యకు ఇతర కళలు త్వరగానే వంటబట్టాయి. యక్షగానం, వీధి నాటకాలు, చిన్న వయస్సులోనే ప్రదర్శించేవారు. నాటకాల్లో రామాంజనేయ యుద్ధంలో రాముడు, తులాభారంలో శ్రీకృష్ణుడు, గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడు వేషాలు వేసి నాటకాలను రక్తికట్టించారు. వీధి నాటకాల్లో అర్ధనారీశ్వరుడు, రుక్మిణి, సత్యభామ, ద్రౌపతి, రంభ వేషధారణతో ఆకట్టుకున్నారు. వీధిభాగవతం ఆడేవారు. అలాగే తబల, హార్మోనియం వాయించేవారు.

### హరికథ నేర్చుకుని..

రమణయ్యకు పాక్షికంగా అంగవైకల్యం ఉంది. ఆయన నాటకాలు, వీధి నాటకాల్లో రాణిస్తున్నా బంధువులు ఎగతాళి చేశారు. దీంతో ఆత్మాభిమానం దెబ్బతిన్న ఆయన పట్టుబట్టి నీలకంఠం భాగవతార్ వద్ద 1981లో హరికథ నేర్చుకున్నారు. ఆ తర్వాత మచిలీపట్నం తరగటూరు ఆంజనేయులు దాసు వద్ద హరికథలో మరిన్ని మెలకువలు నేర్చుకున్నారు. 1982 నుంచి ఆలిండియా రేడియోలో హరికథలు చెబుతున్నారు. సతీతులసి, జలంధర, భూకైలాస్, భక్త మార్కండేయ, గజేంద్రమోక్షం, భక్తమయూర ధ్వయం, భక్తచంద్రహాస, పద్మవ్యూహం, నర్తనశాల, ఉత్తరగోగ్రహణం, శ్రీకృష్ణ రాయబారం, ధర్మరాజు అశ్వమేధయాగం, శ్రీనివాస కల్యాణం, సీతారామ కల్యాణం, శ్రీరామ జననం, భక్త అన్నమయ్య, మహాభక్త రామవిజయం హరికథలు చెప్పడంతో ప్రసిద్ధి చెందారు. రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో తిరిగి హరికథలు చెబుతూ హరికథకు ప్రాణం పోస్తున్నారు. 12 ఏళ్ల వయస్సులో హరికథను చెప్పడం ప్రారంభించి 42 సంవత్సరాలుగా హరికథే శ్వాస, ధ్యాసగా జీవిస్తున్నారు. ఇప్పటి వరకు 10,623 సార్లు హరికథ చెప్పారు. హరికథ ద్వారా వచ్చే చదివింపులను వివిధ ఆలయాలకు విరాళంగా అందజేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో దాతల సహకారంతో ఆలయాలను నిర్మించడానికి, పాడుబడిన ఆలయాలను పునర్నిర్మించడానికి కృషి చేశారు.

### సత్కారాలు ఎన్నో..

రమణయ్య హరికథకు మెచ్చి సత్కరించిన ప్రముఖులు ఎందరో ఉన్నారు. ఆయన పొందిన అవార్డులు, రివార్డులు, సత్కారాలు ఎన్నో. మైసూరు గణపతి సచ్చిదానందస్వామి, మైసూరు విజయేంద్ర సరస్వతి, మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆలయ పీఠాధిపతి, సుబుదేంద్రస్వామి వంటి ప్రముఖులతో సత్కారాలు పొందారు. ఆయన హరికథ ప్రతిభను గుర్తించి ఢిల్లీలోని మనం ఫౌండేషన్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కళాకారులు బాధలు తెలిసిన రమణయ్య భాగవతార్ సాటి కళాకారులను ప్రోత్సహించడానికి అన్నమయ్య కళాపీఠం స్థాపించి సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సహకారంతో దాదాపు వెయ్యిమంది కళాకారులను ఘనంగా సత్కరించారు. 50 మంది పేద జంటలకు వివాహాలు చేశారు. హరికథను బతికించడానికి ముగ్గురు మహిళలకు హరికథ నేర్పించారు. అన్నమయ్య కళాపీఠం ద్వారా అన్నమయ్య సంకీర్తనలు నేర్పించారు.



**కళలను ప్రభుత్వం ఆదరించాలి**

**- రమణయ్య భాగవతార్**

నాడు ప్రజలను చైతన్యం చేసి దశ, దిశ చూపిన కళలు నేడు ఆదరణ లేక కనుమరుగు అవుతున్నాయి. ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి. క్రీడలను ప్రోత్సహించినట్లుగానే కళలను ప్రోత్సహించాలి. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగానే మన రాష్ట్ర ప్రభుత్వం పథకాల ప్రచారానికి కళాకారులను ఉపయోగించుకుని వేతనాలు చెల్లించాలి. కళలు అంతరించిపోకుండా ప్రాచీన కళలను విద్యార్థులకు పాఠ్యాంశాలుగా బోధించాలి.

## ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలి

**కలెక్టర్ చామకూరి శ్రీధర్**



నియామకపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలు, మోడల్ పాఠశాలలకు నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని వివిధ కేజీబీవీ పాఠశాలలు, మోడల్ పాఠశాలలకు నూతనంగా ఎంపికైన సీఆర్‌టీలు, ప్రధానోపాధ్యాయులు, పార్ట్‌టైం ఉపాధ్యాయులకు నియామకపత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తారని, వారి కృషి, ప్రోత్సాహం ద్వారా యువత సరైన మార్గంలో నడుస్తుందని తెలిపారు. జిల్లాలో నూతనంగా ఎంపికైన సీఆర్టీలు, ప్రధానోపాధ్యాయులు, పార్ట్‌టైం ఉపాధ్యాయులు మొత్తం 30 మంది ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు అవగాహన సదస్సు

మదనపల్లె టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ నేర పరిశోధన విభాగం (సీఐడీ) ఆధ్వర్యంలో బుధవారం మదనపల్లెలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తిరుపతి సీఐడీ డీఎస్పీ పద్మలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ సదస్సుకు ప్రజలు హాజరు కావాలని ఆమె కోరారు.

# కురబలకోటలో సైకో వీరంగం

**● చిన్నారులపై దాడి**
**● దేహశుద్ధి చేసిన స్థానికులు**





పోలీసు జీపును అడ్డుకుంటున్న గ్రామస్తులు, పోలీసుల అదుపులో నరసింహారెడ్డి

కురబలకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అభం..శుభం తెలియని చిన్నారులపై సైకో వీరంగం చేసి గాయపరిచిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు... మండలంలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులపై సైకోగా మారిన మతిస్థిమితం లేని వ్యక్తి దాడి చేశాడు. పాఠశాలలో చదువుతున్న చిన్నారులు మూత్ర విసర్జన చేయడానికి స్కూల్ నుంచి బయటకు వచ్చిన రెండో తరగతి చదువుతున్న విద్యార్థినపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో గట్టిగా కేకలు వేయడంతో మరో నలుగురు చిన్నారులు అక్కడికి వెళ్లగా వారిపైనా దాడి చేయడంతో స్వల్పంగా గాయపడ్డారు. దీంతో సైకో అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చిన్నారులను వెంటబెట్టుకుని వెళ్లి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఇతను తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ కొప్పలవారిపల్లెకు చెందిన నరసింహారెడ్డిగా గుర్తించారు. కాగా వారం రోజులుగా గ్రామంలో తిరుగుతూ గ్రామస్తులు పెట్టే భోజనం తింటూ ఉండేవాడు. రాత్రివేళలో గ్రామ సమీపంలో నిద్రించేవాడు. ఈ క్రమంలో చిన్నారులపై దాడి చేసి గాయపరచడంతో కోపోద్రిక్తులై అతడిని దేహశుద్ధి చేశారు. విషయం పోలీసులకు తెలియడంతో అక్కడికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ముగిసిన అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలు





ప్రథమస్థానం సాధించిన శ్రీకాకుళం జట్టుతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బృందం, రెండో స్థానం సాధించిన కడప జిల్లా జట్టు

**● విజేతగా నిలిచిన శ్రీకాకుళం, కడప జట్టు ద్వితీయ స్థానం**

రైల్వేకోడూరు (రూరల్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మండలంలోని బుడుగుంటపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అండర్-19 బాలికల హ్యాండ్‌బాల్ పోటీలలో శ్రీకాకుళం జిల్లా ప్రథమ బహుమతి సాధించిందని కడప జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.శారద తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా జట్టు రెండవ స్థానం, పశ్చిమ గోదావరి జిల్లా జట్టు మూడో స్థానం దక్కించుకున్నారని ఆమె తెలిపారు. ఎంపికైన జట్లు డిసెంబరు 11 నుంచి 17వ తేదీ వరకు పంజాబ్‌లోని లుధియానాలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సోమవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.విజయప్రసాద్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.చంద్రమోహన్ రాజు, టోర్నమెంట్ అబ్జర్వర్ విజయకుమార్ బుడుగుంటపల్లె సర్పంచ్ చంద్రశేఖర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చంగల్‌రెడ్డి, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఇళ్ల జియో ట్యాగ్‌లో పురోగతి సాధించాలి

***విద్యార్థులకు అపార్ ఐడీలు త్వరితగతిన జనరేట్ చేయాలి : కలెక్టర్ చామకూరి శ్రీధర్***

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఇళ్ల జియో ట్యాగింగ్‌లో పురోగతి సాధించాలని, విద్యార్థులకు త్వరితగతిన జనరేట్ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు.

సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, ఆర్డీవోలు జిల్లా అధికారులు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో పీజీఆర్ఎస్, ఎన్టీఆర్ హౌసింగ్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూశాఖకు సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలు గత వారంలో వెయ్యికి పైగా ఉండేవని వాటిల్లో దాదాపు 50 శాతంపైగా పరిష్కరించి మంచి పురోగతి సాధించారన్నారు. రెవెన్యూ శాఖను స్ఫూర్తిగా తీసుకుని మిగతా జిల్లా అధికారులందరూ వారి శాఖలకు సంబంధించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీల పురోగతిపై వివిధ ప్రశ్నలు అడిగి, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ ఇళ్లకు సంబంధించిన జియో ట్యాగింగ్ గురించి సమీక్షిస్తూ... హౌసింగ్‌శాఖ, ఎంపీడీవోలు సమన్వయం చేసుకుని పురోగతి సాధించాలన్నారు. విద్యార్థులకు మంజూరు చేసే అపార్ ఐడీలకు గురించి సమీక్షిస్తూ ఎంఈవోలు, ఎంపీడీవోలు సమన్వయం చేసుకుని జిల్లాలో ఈ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్వో మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వాలీబాల్ జట్టుకు గాలివీడు విద్యార్థి



రాష్ట్ర జట్టుకు ఎంపికైన జస్వంత్

గాలివీడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాలీబాల్ జట్టుకు గాలివీడు విద్యార్థి చీకటి జస్వంత్ ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గాలివీడు మండలం కరిమిరెడ్డిగారిపల్లెకు చెందిన వీఆర్ఏ కుమార్ కుమారుడు జస్వంత్ కడప చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజులుగా విజయవాడలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ చాంపియన్‌షిప్ వాలీబాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంతో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

# యువతి ఆత్మహత్య



మృతి చెందిన బోనం నవ్య

రాజంపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వివాహం ఇష్టం లేక ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఊటుకూరుకు చెందిన వెంకటసుబ్బమ్మకు ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబ పోషణ కోసం ఆమె కువైత్‌కు వెళ్లింది. భర్త వెంకటసుబ్బయ్య ఈ మధ్యనే మృతి చెందాడు. పెద్ద కూతురుకు గతంలోనే వివాహం కాగా, చిన్నకూతురు నవ్య (24) చదువు పూర్తి కావడంతో వెంకటసుబ్బమ్మ కువైత్ నుంచి వచ్చి ఆమెకు వివాహం చేయాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం వెంకటసుబ్బమ్మ పెంచలకోనకు వెళ్లిన సమయంలో ఇంటిలో నవ్య ఉరి వేసుకుని మృతి చెందింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు రాజంపేట మన్నూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

## ప్రిన్సిపాల్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీధర్

నిమ్మనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కె.శ్రీధర్‌కు సోమవారం విజయవాడ ఎస్-కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ చేతు మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు గురుపూజోత్సవంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం సంతోషంగా ఉందని, మరింత పట్టుదలతో శ్రమించి కళాశాలకు మంచి పేరు తెచ్చి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

## మైనార్టీ శాఖ తరపున కరీముల్లాకు...



కరీముల్లాకు అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయుడు కేసీ కరీముల్లాఖాన్ మైనార్టీ, న్యాయశాఖామంత్రి ఎండీ ఫరూక్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో సోమవారం ఈ అవార్డు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారికి అవార్డుతో పాటు నగదు ప్రోత్సాహం ఇస్తోంది. ఇందులో భాగంగానే కరీముల్లాకు రూ.10 వేలు చెక్కు, జ్ఞాపిక, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యప్రసాద్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, వివిధ జిల్లాలకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయులు, భాషాభిమానులు పాల్గొన్నారు.


# కంచే చేను మేస్తే...

**● కురబలకోట రెవెన్యూలో భూబాగోతం**
**● డీకేటీ భూమిని భర్త పేరుతో మార్చేసిన రెవెన్యూ ఉద్యోగి**



పిచ్చలవాండ్లపల్లె వద్ద సర్వే నెంబర్ 629 లోని భూమి

కురబలకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆమె రెవెన్యూ శాఖలో చిన్నపాటి ఉద్యోగి. రెవెన్యూకు సంబంధించిన శాఖలో పనిచేస్తుండటంతో తనను ఎవరు అడుగుతారు లే అనే ధైర్యమో లేక ఎవరికీ తెలియదనే నమ్మకమో ఏమో గానీ చక్కగా తన కార్యకలాపాలను చేసుకున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం వేరొకరి పేరుతో పట్టా మంజూరు చేసిన భూమిని గుట్టుచప్పుడు కాకుండా తన భర్త పేరు మీద వన్‌బీ హక్కును కల్పించారు. రెండెకరాలకు పైగా భూమిని కాజేయడమే కాకుండా తిరిగి భూయజమాని మీదకే గొడవకు వెళ్లారు.




శంకర్ పేరుతో మంజూరు చేసిన వన్‌బీ అడంగల్

కురబలకోటలో రెవెన్యూ అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. పైసలిస్తే చేయకూడని అడ్డమైన పనులను గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ డీకేటీ భూములను ఇతరుల పేరు మీద మార్చి వన్‌బీ అడంగల్ హక్కును కల్పించడం నిబంధనల మేరకు చట్టరీత్యా సాధ్యం కాదు. కానీ ఇక్కడ పని చేస్తున్న అధికారులకు ఆ పనులు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిసిన ఏ మాత్రం లెక్కచేయకుండా డబ్బు ఆశతో అడ్డదిడ్డంగా పనులు చేశారు.

ఇలాంటి భూములకు భూమి హక్కును ఆన్‌లైన్ చేయడం ద్వారా కల్పించారు. పదుల సంఖ్యలో వివిధ గ్రామాల్లో భూములను ఇతరుల పేరుతో మార్పులు చేశారు. ఒకరి పేరు మీదన ఉన్న భూమిని వారికి తెలియకుండానే మరొకరి పేరున మార్చేశారు. ఈ విషయం బాధితులకు తెలిశాక అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన సమస్యను ఇంతవరకు పరిష్కరించ లేదు. కాగా ప్రాంతం, విస్తీర్ణాన్ని బట్టి రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకు డబ్బులు తీసుకున్నట్లు బహిరంగా ఆరోపణలు వినిపించడంతో పాటు పలువురు బహిరంగ ప్రదేశాల్లో చర్చించుకుంటున్నారు.

ఇంత తంతు జరిగినా తమకు ఏమి తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 629లోని 2.34ఎకరాల భూమి 1995లో గ్రామానికి చెందిన కదిరప్ప పేరు మీదన పట్టాను మంజూరు చేశారు. అయితే ఈ భూమిని కాజేయాలని రెవెన్యూలో పని చిన్నస్థాయి అధికారి పథకం పన్ని తన భర్త శంకర పేరు మీదన వన్‌బీ హక్కు కల్పించారు. దీంతో బాధితులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు.

**మాకు తెలియకుండానే పట్టా చేసుకున్నారు**



మాకు తెలియకుండానే గ్రామ వీఆర్ఏ భర్త శంకర పేరు మీద పట్టా చేసుకున్నారు. మా నాన్నకు 1995లో పట్టా ఇచ్చారు. అయితే ఆయన వారసత్వంగా మాకు రావాలి. కానీ నన్ను మాటమాత్రమైన అడగకుండా వేరొకరి పేరున వన్‌బీ హక్కు కల్పించారు. అంతేకాకుండా మాపై వాళ్లు దాడులకు వస్తున్నారు. అధికారులు విచారించి మాకు న్యాయం చేయాలి.

- వెంకట్రాయప్ప, భూయజమాని

**విచారించి న్యాయం చేస్తాం**

ఈ భూములకు సంబంధించి గతంలో పాసుపుస్తకాలు మంజూరు చేశారు. దీనిపై గ్రామానికి చెందిన ఆయన మాకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటాము. ఇరువర్గాలను పిలిపించి విచారిస్తాము.

- తపస్విని, తహసీల్దార్



# తేలనున్న పశువుల లెక్క

● వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన సర్వే ● నిధులు, పథకాల రూపకల్పనకు అవకాశం

**జిల్లాలో పశువుల వివరాలు**

20వ అఖిలభారత పశుగణన సర్వే ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పశువుల వివరాలు ఇలా ఉన్నాయి. గేదెలు (నల్లజాతి పశువులు) 3,99,754, ఆవులు, ఎద్దులు 44 వేలు, మేకలు 3,80,099, గొర్రెలు 9,20,614, కోళ్లు 10 వేలు, పందులు 2,775 ఉన్నాయి.

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశుగణనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా జిల్లాలోని ప్రతి కుటుంబం, ఇంటింటికి చెందిన పశువుల వివరాలను ఇందులో నమోదు చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమిలేని కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పశుసంవర్థక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు పశుగణన ఉపయోగపడుతుంది. మార్గదర్శకాలను అనుసరించి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈప్రక్రియ కొనసాగనుంది. ఇందుకు గణకులు, పర్యవేక్షకులు ఇప్పటికే ఇంటింటి సర్వేలో భాగంగా పశువుల వివరాలను నమోదు చేస్తున్నారు. తొలుత సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించడానికి రాష్ట్ర పశుసంవర్థక శాఖ ఉత్తర్వులు జారీ చేయగా అనివార్య కారణాలతో అది వాయిదా పడింది. దీంతో అక్టోబరు 25 నుంచి గణను ప్రారంభమైంది.

**పథకాల అమలుకు...**

జిల్లాలో వ్యవసాయ రంగం తర్వాత పశుసంవర్థక రంగం చాలా కీలకమైంది. రాష్ట్ర స్థూల నిష్పత్తిలో ఈశాఖ నుంచి 8 నుంచి 9 శాతం ఆదాయం వస్తుంది. జిల్లాలో పశుపోషణపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 1.80 లక్షలపాడి కలిగిన రైతులు ఉన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలకు కొత్తగా చేపట్టనున్న పశుగణన దోహదపడుతుంది. నాలుగు నెలలుగా పైగా చేపట్టనున్న ఈ గణనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ రూపొందించింది.

పశుసంవర్థక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన, అమలు పర్యవేక్షణకు ఈ గణన ఉపయోగపడుతుంది. గేదెలు, ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు, పందులు, ఇతర పెంపుడు జంతువులు అయిన కోళ్లు, పక్షులు, పావురాళ్లు, చిలుకలు, గుర్రాలు, టర్కీ కోళ్లు తదితరవి కలిపి మొత్తం 16 రకాల గణన చేస్తున్నారు.



ఇంటింటి పశుగణన చేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది

**726 రెవెన్యూ గ్రామాల్లో....**

కడప జిల్లాలో 36 మండలాల్లో ఉన్న 726 రెవెన్యూ గ్రామాల్లోని 557 గ్రామ పంచాయతీల్లో ఇంటింటి పశుగణన ప్రారంభించారు. ఇందులో 236 మంది ఎన్యుమరేటర్లు, 72 మంది సూపర్‌వైజర్లతోపాటు పశువర్థక సహాయకులు, సిబ్బంది పాల్గొంటున్నారు. పశువైద్యాధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. ఈ ప్రక్రియను జిల్లా అధికారులు, పర్యవేక్షకులు ఆయా వివరాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పశుగణనపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ మాట్లాడుతూ పశుగణనపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ఆకస్మిక తనిఖీలు చేసి సెన్సెస్‌లు తీసే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఆరోగ్య సమస్యలు నుంచి పశువులను కాపాడుటకు సూచనలు జారీ చేస్తున్నామన్నారు. అనుకున్న లక్ష్యానికి 15 రోజుల ముందే ఈ గణన ప్రక్రియ పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నట్లు ఆమె వివరించారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి : యూటీఎఫ్



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేశ్‌బాబు కోరారు. సోమవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాల విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని దానిని తిరిగి పునర్నిర్మించే పని ఈప్రభుత్వం చేస్తుందని ఉపాధ్యాయులు భావిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి చాలా తక్కువ నిధులు కేటాయించడం తీవ్ర నిరాశపరిచిందన్నారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి నిధులు అధికంగా కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో యూటీ ఎఫ్ నాయకులు క్రిష్ణారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులను నిరాశపరిచిన బడ్జెట్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర బడ్జెట్ ఉద్యోగులను నిరాశపరిచిందని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగు బకాయిలు చెల్లి ంపు విధానంపై బడ్జెట్‌లో చూపించలేక పోవడం జరిగిందన్నారు. పీఆర్సీ గడువు ముగిసి 16 నెలలు గడుస్తున్నా ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదిశాతం మేర పాఠశాల విద్యకు బడ్జెట్ కేటాయించడం సంతృప్తి నిచ్చిందన్నారు.

## ఫిర్యాదులపై తక్షణం స్పందించి న్యాయం చేయాలి

● జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు

కడప క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

## జాతీయ వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు మొదలు పెట్టిన సమయం నుంచి లబ్ధిదారులకు అందే వరకు సరైన ఉష్ణోగ్రత ఉండేట్లు చూడాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు ఇచ్చిన సమయంలో టీకాల వల్ల దుష్పరిణామాలు ఏమైనా వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిపోర్టింగ్ విషయాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు మరియు ప్రాథమిక పట్టణ వైద్యాధికారులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై అల్లరిమూక దాడి

వేంపల్లె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప రోడ్డులో అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డిపై అల్లరిమూక దాడికి తెగపడింది. నడిరోడ్డుపై ఘర్షణ పడటంతో దారిన వెళ్లే వారు బయాం దోళ నకు గురయ్యారు. ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ అక్కడికి చేరుకుని అల్లరి మూకను తరిమి కొట్టారు. గాయపడ్డ శ్రీకాంత్‌రెడ్డిని చికిత్స నిమిత్తం కడపకు పంపించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఈ సందర్భంగా ఎస్‌ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నరసింహులు (ఫైల్‌ఫొటో)

దువ్వూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం జిల్లేళ్ల గ్రామ సమీపంలోని రెస్ట్‌హౌస్ దగ్గర ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లూరి నరసింహులు (37) మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. దువ్వూరు నుంచి జిల్లేళ్లకు బైక్‌పై ముగ్గురు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం స్కూటర్‌ను వెనుకవైపు నుంచి వచ్చి ఢీకొంది. వెంటనే 108 వాహనంలో వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నరసింహులు మృతి చెందాడు. మృతుని బావ అరవిందకుమార్, తండ్రి నరసింహులు గాయపడగా వీరిని ఆస్పత్రిలో చేర్పించారు. దువ్వూరు పోలీసులు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## పొలం విషయమై ఘర్షణ.. ఇద్దరికి గాయాలు



గాయపడ్డ రామసుబ్బమ్మ

లింగాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లెలో సోమవారం పొలం విషయమై జరిగిన ఘర్షణలో బోనాసి బాబు, బోనాసి రామసుబ్బమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ మధుసూదన్‌రావు వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నేర్జాంపల్లె గ్రామ పొలంలో బోనాసి రామసుబ్బమ్మకు, బోనాసి సరస్వతమ్మకు భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి ఆరేళ్లుగా ఇరు కుటుంబాలకు మనస్పర్థలు ఉన్నాయి. గత మేనెలలో రామసుబ్బమ్మ తన పొలంలో రెండువేల అరటిమొక్కలను నాటగా సరస్వతమ్మ అల్లుడు మన్నెల శ్రీనివాసులు సుమారు 1200 మొక్కలను ధ్వంసం చేశారు. అప్పటి నుంచి సమస్య ముదురుతూ వచ్చింది. ఆ సమయంలో యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాసులుపై కేసు కూడా నమోదు చేశారు. సోమవారం పార్నపల్లెలో బోనాసి బాబు తన కుమారుడిని స్కూల్‌కు తీసుకెళ్తుండగా అతనిపై మన్నెల శ్రీనివాసులు, మన్నెల కుమారి, మన్నెల సింధు దాడి చేశారు. బాబు తల్లి రామసుబ్బమ్మ అక్కడకు చేరుకోగా ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు వెల్లడించారు.

## మద్యం మత్తులో ఘర్షణ - కేసు నమోదు

మైలవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మాట మాట పెరిగడంతో సోమవారం ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. దీంతో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు తలమంచిపట్నం ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మండల పరిధిలోని మాధవాపురం గ్రామంలో ఆదివారం రాత్రి ఓబయ్య, కొండయ్యతోపాటు నాగమహేష్, నాగేంద్రప్రసాద్ మరో ఇద్దరు మద్యం మత్తులో మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంపై ఓ వర్గానికి చెందిన వారు విమర్శించడంతో మరో వర్గం వారు ప్రభుత్వం బాగా చేస్తోందని వాగ్వాదానికి దిగా రు. మాట మాట పెరగడంతో మద్యం మత్తులో ఘర్షణ పడ్డారు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

కడప(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మోడమీదపల్లికి చెందిన అఖిల(25) అనే వివాహిత నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. మోడమీదపల్లికి చెందిన అఖిలకు మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన నాగకేశవతో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. గత కొన్ని రోజుల నుంచి ఆరోగ్య సమస్యలతో మనోవేదనకు గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. బంధువులు గమనించి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

## ప్రేమించి పెళ్లి చేసుకోకపోవడంతో..

కడప(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం గుండె అంజలి (25) అనే యువతి మృతి చెందినట్లు ఒన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. సుండుపల్లెకు చెందిన అంజలి కడప నాగరాజుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేసేది. అక్కడే పనిచేస్తున్న భానుప్రసాద్ చేస్తుండగా ఇరువురు ప్రేమించుకున్నారు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని యువతి అడగడంతో భానుప్రసాద్ ఒప్పుకోలేదు. దీంతో మనస్థాపం చెంది ఈనెల 6వ తేదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఇద్దరు బాలికలు అదృశ్యం

కడప(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసు స్టేష న్ పరిధిలో ఇరువురు విద్యార్థినులు అదృశ్యమైనట్లు సీఐ వెంకటేశర్లు తెలిపారు. బాలజీనగర్‌కు చెందిన బాలిక, కాగితాలపెంటకు చెందిన బాలిక ప్రైవేట్ స్కూ ల్‌లో 8వ తరగతి చదువుతున్నారు. సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లి ఎదురుగా ఉన్న షాపులో దోశ తినేందుకు వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## అత్యంత కీలకం భూగర్భజల అధ్యయనం : వీసీ




మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూగర్భజల అధ్య యనానికి అత్యంత ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరం ఉందని వైస్‌చా న్సలర్ కె.క్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం వైవీయూలో భూగర్భ నీటి వనరుల సుస్థిరత, నిర్వహణపై మూడు రోజులు జరిగే శిక్షణ తరగ తులను వైస్‌చాన్సలర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ రాను రాను వర్షపాతం తగ్గుతుందని.. భూగర్భజలాలు అడు గంటుతాయని.. ఇప్పుడు ఆలోచించకపోతే భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. భూగర్భజల అధ్యయనం క్లౌడ్ కంప్యూ టింగ్ వంటి కోర్సులకు మంచి అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశా రు. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజనల్ డైరెక్టరు క్రిష్ణమూర్తి మాట్లాడుతూ రాయలసీమలో భూగర్భ జల సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాము ఇవ్వబోయే శిక్షణ ద్వారా భూమిలో ఖనిజ లవణాల గురించి నేటితరం అవగాహన పొందుతుందన్నారు. తద్వారా భూమిలో నిల్వలు ఎంత ప్రయోజనకరమైనవో తెలుస్తుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథ రెడ్డిలు మాట్లాడుతూ కరువుప్రాంతాల్లో భూగర్భజలాలు పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎర్త్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసరు శివప్రతాప్, జియాలజీ విభాగాధిపతి రవిబాబు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహనతోనే నవసమాజ నిర్మాణం




మాట్లాడుతున్న ఆర్డీవో జాన్‌ఇర్వీన్

కడప(వినాయకనగర్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన పెంచుకున్నపుడే చైతన్యంతో పాటు నవసమాజ నిర్మాణం జరుగుతుందని కడప ఆర్డీవో జాన్‌ఇర్వీన్ తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో సీఐడీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అఘాయిత్యాల నివారణపై చైతన్య సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకున్నపుడే న్యాయం జరుగుతుందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. మున్సిపల్ అదనపు కమిషనర్ రాకేశ్‌చంద్రం మాట్లాడుతూ సమానత్వం, కులవివక్ష నిర్మూలించడానికి ప్రవేశపెట్టిన సివిల్‌రైట్స్ యాక్ట్ ప్రకారం వివక్ష తగ్గిందన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలాజీ ఎస్సీ, ఎస్టీ చట్టాలు, నియమ నిబంధనల గురించి తెలిపారు. సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ వివేకానంద మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు, మార్గదర్శకాలు రుణాల గురించి తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ డీఎస్పీ పద్మలత, దిశా పోలీస్‌స్టేషన్ సీఐ క్రిష్ణారెడ్డి, సీఐడీ అధికారులు బాబాఫకృద్దీన్, శ్రీనివాసులరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంత మంది విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు.

## విభిన్న ప్రతిభావంతులకు చట్టపరమైన సేవలు

● సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్




మాట్లాడుతున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలు విభిన్న ప్రతిభావంతులకు చట్టపరమైన సేవలను అందిస్తాయని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ తెలిపారు. కడప నగరం రామాంజనేయపురంలోని హెలెన్ కెల్లర్ ప్రత్యేకపాఠశాల, జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం, మానసిక వికలాంగులకు చట్టపరమైన సేవల పథకం, విభిన్న ప్రతిభావంతుల పిల్లల కోసం న్యాయసేవల పథకం, లీగల్ సర్వీసెస్ టోల్‌ఫ్రీ నెంబర్ 15100పై వివరించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల డిపార్ట్‌మెంట్ అధికారులు, వైద్యశాఖ అధికారులు సంయుక్తంగా మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి వైద్యాధికారుల చేత ఆడియో మెట్రేషన్ టెస్టులు నిర్వహిం చి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం జడ్జి బాబాపక్రుద్దీన్ 10 మంది పిల్లలకు హియరింగ్ మిషన్స్‌ను అందజేశారు. సోమవారం పురుషులు, మహిళల కేంద్ర కారాగారాలను జడ్జి విజిట్‌చేసి న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాలలో ట్రైనీ జడ్జిలు జె.నందిని, ఖాజామొహిద్దీన్, ఎం.అనిల్‌కుమార్ నాయక్, ఎం.ఆశాప్రియా, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



ఏసీఏ మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ నవంబర్ 11, (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్ రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లు సోమవారం డ్రాగా ముగిశాయి. వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు-విజయనగరం జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విజయనగరం జట్టు 80.3 ఓవర్లలో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 250 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు రెండవ రోజు 84 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో నెల్లూరు జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 10 పరుగుల ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన విజయనగరం జట్టు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలాగే కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం-క్రిష్ణా జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 322 పరుగులు భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన క్రిష్ణా జట్టు 63.4 ఓవర్లలో 247 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కేఎస్ఆర్ఎం మైదానంలో శ్రీకాకుళం-గుంటూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. తదుపరి శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53.3 ఓవర్లలో కేవలం 139 పరుగులకే చేతులెత్తేసింది. రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

# దేశసేవ లక్ష్యంగా పరుగు

● రెండోరోజు కొనసాగిన ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ



అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఆర్మీ అధికారి



అభ్యర్థులకు లాంగ్ జంప్ నిర్వహిస్తున్న ఆర్మీ అధికారులు

కడప స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ మైదానంలో అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ రెండోరోజు సోమవారం కొనసాగింది. జన్మనిచ్చిన మాతృదేశానికి సైనికులుగా సేవలందించాలనే లక్ష్యంతో ఆర్మీ రిక్రూట్‌మెంటుకు వచ్చిన యువకులు రెట్టించిన ఉత్సాహంతో పరుగుపందెంలో పాల్గొన్నారు. ఆ మేరకు రెండోరోజు పరుగుపందెంతో పాటు జిగ్ జాగ్ బ్యాలెన్స్, పుల్లప్స్, హైజంప్, లాంగ్‌జంప్ తదితర పోటీలను ఆర్మీఅధికారులు నిర్వహించారు. ఇందులో క్వాలిఫై అయిన వారికి ఆ వెంటనే మెడికల్ టెస్ట్ నిర్వహించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్‌ఆధ్వర్యంలో ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. రోజువారీగా 800 మంది అభ్యర్థులను టెస్టులకు సిద్ధం చేస్తున్నారు. ఆకోవలో సోమవారం కర్నూలు, చిత్తూరు జిల్లాకు చెందిన అభ్యర్థులకు పోటీలు నిర్వహించారు.

## రైతుసేవా కేంద్రం తనిఖీ

సిద్దవటం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచుపల్లె రైతుసేవా కేంద్రాన్ని సోమవారం బద్వేల్ వ్యవసాయ సంచాలకులు నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వ్యవసాయ సహాయకురాలు లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చంద్రకళ, చిన్నక్క, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్‌తో ఫోన్ నంబర్ లింక్ చేసుకోండి

సిద్దవటం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలం టక్కోలి ఎస్సీ కాలనీలో దీపం లబ్ధిదారుల ఆధార్‌కు, ఫోన్ నంబరుతో లింక్‌చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.పోస్ట్‌మాన్ నరసింహారెడ్డి, కృష్ణయ్య, శశి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పెనగలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబిలి గ్రామంలో సోమవారం కావేటి చలపతి, భాగ్యమ్మ దంపతుల ఆధ్వర్యంలో గ్రామదేవత గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ గ్రామ ప్రజలతో పాటు యూత్ సభ్యులు సహాయ సహకారాలు అందించారు.

## రూపానందరెడ్డికి సన్మానం

పెనగలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) :ఆడా కార్పొరేషన్ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిని సోమవారం మండల టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు నాగినేని రాంప్రసాద్‌నాయుడు, కట్టవారిపల్లె క్లస్టర్ ఇన్‌చార్జి కె.నాగేశ్వర్‌రావునాయుడు, కమ్మ సంఘం మండల కార్యదర్శి పి.నరేష్ బాబు తదితరులు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆలయానికి రూ.52,116 విరాళం

నందలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి అరవపల్లెకు చెందిన ఎల్‌ఐసీ విశ్రాంత ఏవో మాడపూరి సుబ్బరాయుడు ఆయన ధర్మపత్ని మాడపూరి హేమలత వారి కుటుంబ సభ్యులు ఒక పిల్లర్ నిర్మాణానికి 52, 116 రూపాయలు విరాళంగా ఆలయ ప్రతినిధి ఏనుగుల బాలాంజనేయులుకు సోమవారం అందజేశారు.

## మన్నూరు సీఐగా మహ్మద్ అలీ



రాజంపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలోని మన్నూరు పోలీసుస్టేషన్‌లో సోమవారం మహ్మద్ అలీ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన రాజంపేట పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. అనంతరం సీఐగా హిందూపురం, కడప పోలీసు స్టేషన్‌లో, ఏసీబీలో బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అలరించిన మహిళల కోలాట ప్రదర్శన

రాయచోటిటౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా రాయచోటి పట్టణంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో కోలాటం మాస్టర్ తుమ్మల హరినాథ్ ఆధ్వర్యంలో రాయచోటిలోని లక్ష్మీపురం మహిళలు ప్రదర్శించిన కోలాటం కార్యక్రమం భక్తులను అలరించింది. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

చిన్నమండెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం రెడ్డెన్న ఆధ్వర్యంలో సోమవారం పర్యావరణ పరిరక్షణలో వృక్షాల పాత్ర, పర్యావరణ పునరుద్ధరణపై అవగాహన కల్పించారు. పుస్తకాల తయారీ కకోసం చెట్లు నరికివేస్తారని తెలిపారు. దీంతో, తమవద్ద నున్న పాత పుస్తకాలను విద్యార్థులు రీసైక్లింగ్‌కు ఇచ్చారు. ఆయా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

# ఆగిన అభివృద్ధి!



చింతలయ్యగారిపల్లి సమీపంలో గుంతలమయమైన తారురోడ్డు

- అధ్వానంగా రహదారులు
- అర్థాంతరంగా ఆగిన పనులు
- పల్లె పండుగకు ఎదురుచూపు?
- అవస్థలు పడుతున్న ప్రజలు

సుండుపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి ఆగిపోయింది. ఐదు నెలల క్రితం అధికారం చేపట్టిన కొత్త ప్రభుత్వం సమస్యలు గుర్తించి నిధులు మంజూరు చేసినా మండలంలో పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఐదేళ్లుగా అభివృద్ధికి దూరమైన గ్రామీణ ప్రజానీకం ఆందోళనకు లోనవుతోంది.

2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామపంచాయతీ ఆర్‌కె రోడ్డు నుంచి పూజారి వాండ్లపల్లి వరకు 1.40 కిలో మీటర్ల రోడ్డు ఏర్పాటు కు రూ. 56 లక్షల అం చనా వ్యయంతో పను లు ప్రారంభించారు. మూడు చోట్ల కల్వర్టులు నిర్మించారు. సుమారు 15 లక్షల దాకా నిధులు వెచ్చించారు. మడితాడు గ్రామంలోని రాయ వారం రోడ్డు నుంచి నాయని వారిపల్లెకు పోయే రహదారిలో రూ. 62 లక్షలతో 1.50 కిలో మీటర్ల రోడ్డు పనులు ప్రారంభించారు.



అర్థాంతరంగా ఆగిన కోనేరువాండ్లపల్లి రోడ్డు పనులు

రూ. 34 లక్షలు వెచ్చిచారు. రాయవారం రోడ్డు నుంచి కోనేరువాండ్లపల్లెకు రూ. 58 లక్షలతో 1.05 కిలో మీటర్ల రోడ్డు పనులు ప్రారంభించి రూ. 24 లక్షలు వెచ్చించి ప నులు చేశారు. ఆ తర్వా త అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులన్నింటినీ రద్దు చేసింది. దీంతో రహదారి పనులు అర్థాంతరంగా ఆగి పోవడంతో వాహనదారులు, ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రారంభం కాని పల్లె పండుగ

గత ఐదేళ్లలో ఆగిపోయిన అభివృద్ధి పనులను పునఃప్రారంభించి గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేసి పనులు గుర్తించింది. మండల వ్యాప్తంగా 254 సీసీ రోడ్లు, 7 కంకర రోడ్లు, 12 తారు రోడ్లు, 6 ప్రహరీ గోడల నిర్మించాలని తీర్మానించింది. అయితే, రాష్ట్రమంతా పనులు ప్రారంభమైనా.. సుండుపల్లి మండలంలో మాత్రం ఆ ఊసే లేకుండా పోయింది. దీంతో పనులు ఎప్పుడు ప్రారంభం అవుతాయా అని కూటమి నేతలు, ప్రజలు ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో టీడీపీ కీలక నేతల మధ్య సఖ్యత లేకపోవడంతోనే ఇప్పటి వరకు పల్లె పండుగపై స్పష్టత లేదని తెలుస్తోంది. పనులు గుర్తించాం. కానీ, ఎక్కడెక్కడ ఏఏ పనులు చేయాలో ఇంకా స్పష్టత రాలేదని అధికారులు చేతులెత్తేస్తున్నారు.

### గుంతల రోడ్డుతో నరకం



తారు రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. పల్లె నుంచి మండల కేంద్రానికి పోయేందుకు బస్సు సౌకర్యం కూడా లేదు. ఆటోలు కూడా రావు. రహదారి పనులు చేసి పుణ్యం కట్టుకోండి.

**- స్వర్ణకుమారి, చింతలయ్యగారిపల్లి**

### రాజకీయ లబ్ధికోసమే..



గత ప్రభుత్వంలో పాలకులు ప్రజలను రాజకీయ లబ్ధికోసం వాడుకున్నారు. ఐదేళ్ల పాటు సొంత లాభం కోసం మాత్రమే పాకులాడారు. టీడీపీ హయాంలో ప్రారంభించిన పనులను సైతం అర్థాంతరంగా నిలిపివేశారు

**- మాలేపాటి సురేష్ నాయుడు, తెలుగు యువత**

### 10 రోజుల్లో పనులు ప్రారంభం

గ్రామీణ రహదారులు దయనీయంగా మారిన విషయం వాస్తవమే. పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపిక చేసిన పనులు ప్రారంభించడం ఆలస్యమైంది. అధికారులు గుర్తించిన పనులను పై అధికారులకు వివరించాం. త్వరలో రూ.1.50 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నాం.

**- సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో**

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు11(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పిన కోటి రూపాయలు అందులో జమ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాలి చంద్ర, సలీంబాషా డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు నేటికీ విషయంపై స్పందించలేదని ఆరోపించారు. సోమవారం నుంచి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నిర్మాణ కార్మికులపై చర్చించి సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలని, దారి మళ్లించిన బోర్డు నిధులను జమ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు ఫైల్‌పై మొదటి సంతకం పెడతామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, లేకుంటే గత వైసీపీ ప్రభుత్వానికి పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరించారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుధీర్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రెడ్డి, గఫూర్, బాలకృష్ణ, రమేశ్, శంకరా, మహమ్మద్‌హుస్సేన్, నరసింహ, రమణ, భీమయ్య, నాగేంద్ర, రంగన్న, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీల పెంపు అన్యాయం



రాయచోటి: విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీనేతలు

రాయచోటి టౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలను పెంచాలనుకోవడం అన్యాయమని డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ల నేతృత్వంలో ఆందోళన చేశారు. సర్దుబాటు పేరుతో చార్జీలు పెంచాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో 7 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారుల నడ్డి విరగ్గొట్టిందన్నారు. అమలు కాని హామీలిచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వైసీపీ బాటలో ప్రయాణిస్తోందని మండిపడ్డారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. నాయకులు చాన్‌బాషా, అమీర్‌బాషా, ఖాదర్‌ఖాన్, నాగలత, నవీన్, నజీర్, జాఫర్, సాదిక్, అర్షద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు(రూరల్):** రాఘవరాజుపురం వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గోశాలదేవి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తప్పవని హెచ్చరించారు. పుల్లంపేట మండల నాయకులు సిగమాల రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు రవి, విద్యార్థి నాయకులు శివ, బొమ్మి రజేష్, ఉప్పుటూరు బ్రహ్మయ్య ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

# కార్మికులకు భద్రత కల్పించని బడ్జెట్: సీఐటీయూ

రాయచోటిటౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ కార్మికులకు ఆర్థిక సామాజిక, భద్రత కల్పించలేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు విమర్శించారు. సోమవారం ఆయన సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బడ్జెట్‌లో స్కీమ్ వర్కర్ల వేతనాల పెంపునకు ప్రతిపాదనలు లేవన్నారు. చేయలేదన్నారు. షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్స్‌లో పనిచేసే కార్మికుల వేతనాల పెంపు కూడా విస్మరించారన్నారు. అసంఘటిత కార్మికులందరికీ రంగాల వారీగా ముఠా, లేబర్ వెల్ఫేర్, బిల్డింగ్, బీడీ, రమణా రంగాలకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు చెప్పి బడ్జెట్లో నిధులు కేటాయించలేదన్నారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, నాయకులు శ్రీనివాసులరెడ్డి, యూనియన్ నాయకులు ఆదినారాయణరెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందతో నిండిపోయిందని, రాష్ట్ర ప్రజలకు, కార్మికులకు నిర్దిష్టంగా కలిగే ప్రయోజనాల గురించి ప్రస్తావనే లేదన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల ప్రస్తావన లేదని, సూపర్ సిక్స్ పథకాలన్నీ పూర్తిగా ఎప్పుడు అమలు చేస్తారో చెప్పకపోవడం ఆయా తరగతులకు తీ వ్ర నిరాశ కలిగిస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు.

### అన్ని వర్గాలకు సమన్యాయం

**గాలివీడు:** రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసిందని రిటైర్డ్ ఎకనామిక్స్ లెక్చరర్ కానాల బయ్యారెడ్డి తెలిపారు. చాలా ఏళ్ల తర్వాత ఇలాంటి బడ్జెట్‌ను చూస్తున్నామని, విద్య, వైద్యం, వ్యవసాయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రంగాల అభివృద్ధికి ఎంతో మేలు చేసే విధంగా ఉందని తెలిపారు.

## ఒంటిమిట్టను కరువు మండలంగా ప్రకటించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న యానాదయ్య

ఒంటిమిట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) :మండలంలో పశుగ్రాసం కొరతతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఒంటిమిట్ట మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం నాయకులు కట్టా యానాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు రమణమ్మకు రైతులతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. మండలంలోని చెరువుకు నీరు రాక ఆయకట్టు భూములన్నీ బీళ్లుగా తయారయ్యాయని వెంటనే కరవు మండలంగా ప్రకటించాలని కోరారు.

## శ్మశాన స్థలం స్వాధీనం



శ్మశాన స్థలం సర్వే చేస్తున్న అధికారులు

పుల్లంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని అప్పయ్యరాజుపేట గ్రామంలో ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాన్ని సోమవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్వేయర్ శ్రీ రాములు, వీఆర్వో మల్లికార్జున సర్వే నంబరు 426లో కబ్జాకు గురైన 75 సెంట్ల శ్మశాన స్థలాన్ని సర్వేచేసి గ్రామస్థులకు అప్పగించారు. సర్వేకు స్వాధీనానికి సహక రించిన ఏఎం లీగల్ సర్వీస్ అడ్వకేట్ మనోహర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రాజుకు గ్రామ స్థులు ధన్యవాదాలు తెలిపారు.

## చిరస్మరణీయుడు మౌలానా అబుల్‌కలాం ఆజాద్



దళవాయిపల్లెలో అబుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పుల్లంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం భారతరత్నతో సత్కరించిందని ప్రధానోపాధ్యాయుడు రమణ తెలిపారు. అబుల్‌కలాం జన్మదినం సందర్భంగా సోమవారం దళవాయిపల్లె పాఠశాలలో ఆయన కచిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు(రూరల్):** మండలంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ దీప్తికిరణ్, డాక్టర్ నిశ్చల మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

**రాజంపేట:** అన్నమాచార్య యూనివర్సిటీలో టచ్‌స్టోన్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచశాంతి సాధనలో విద్య ప్రాముఖ్యం అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ పోటీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఎస్.మేఘన, ఎ.మేఘన, సి.వేదప్రసన్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ యుద్ధాలను ఆపడానికి, మనిషి పురోగతిని సాధించడానికి విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

**సుండుపల్లె:** మండలంలోని తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో నివాళులర్పించారు.హెచ్‌ఎం ఆరీఫుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## యూత్ ట్రైనింగ్ సెంటర్ స్థలాన్ని కాపాడాలి

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): ఆక్రమణకు గురైన యూత్‌ట్రైనింగ్ స్థ లాన్ని విడిపించాలని కో రుతూ ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి నరసింహ జేసీ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలోని మెట్టమీదపల్లె పంచాయతీలో యూత్ ట్రైనింగ్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ గిరిజన ఆశ్రమ పాఠశాలకు సర్వే నెంబర్ 1205లో 7 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ స్థలంలో దాదాపు 30 సెంట్ల వరకు ఆక్రమణకు గురైందని తెలిపారు. మిగిలిన స్థలానికైనా రక్షణ గోడ నిర్మించి విద్యార్థులకు ఆట స్థలంగా ఉపయోగించాలని వారు కోరారు. ఎస్ఎఫ్ఐ రాయచోటి నాయకులు సతీశ్, పవన్, కార్తీక్, సాయికార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు నివాస స్థలాలు ఇవ్వాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు11 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దళితులకు నివాస స్థలాలు, సాగుభూమి ఇవ్వాలంటూ కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా దళితులు శ్మశానవాటికలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే అనేక దఫాలుగా నివాస స్థలాలు, సాగు భూములు ఇవ్వాలని మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథులే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాయచోటి పట్టణ కార్యదర్శి జగన్‌బాబు, ఓబులేసు, ఆంజనేయులు, చిన్నప్ప, మహిళా కార్యకర్తలు సుబ్బమ్మ, ప్రమీల, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

రాయచోటిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాయచోటి డీఎస్పీ ఆర్ఎం కృష్ణమోహన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులపై వెంటనే పరిష్కరిస్తామని డీఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.

## సోషల్ మీడియాపై టీఎన్ఎస్ఎఫ్ ఆందోళన



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్, టీడీపీ నేతలు

రాజంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో సుగవాసి బాలసుబ్రమణ్యం వర్గానికి చెందిన కొంతమంది నాయకులు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుపై పెట్టిన పోస్టింగులపై టీఎన్ఎస్ఎఫ్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా కథనాలను నిరూపించాలని రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్ డిమాండ్ చేశారు. .తప్పుడు ఆరోపణలు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పోలీసులు అక్కడికి చేరుకుని నాయకులకు సర్ది జెప్పారు. పార్లమెంట్ కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన చైర్మన్‌లతో సీఎం సమావేశం

చిట్వేలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వివిధ కార్పొరేషన్ల చైర్మన్లుగా నియమితులైన నాయకులను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పనిచేసినవారికి పదవులు, రైట్ ప్లేస్‌లో రైట్‌మ్యాన్ విధానంలో ఎన్నికైన మీరందరూ సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల దినోత్సవానికి రూ.10 వేలు విరాళం

పెనగలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీ విజేతలకు బహుమతి ప్రదానం కోసం చక్రంపేట ఉన్నత పాఠశాల హిందీ పండిట్ పల్లె కృష్ణకుమారి 10 వేల రూపాయల నగదును సోమవారం పాఠశాల ప్రాంగణంలో ఎంఈవో-1 టి.నాగసుబ్బరాయుడు ఆధ్వర్యంలో హెడ్మాస్టర్ గోపాలకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు బి.హరిప్రసాద్, అంజాద్‌బాషా, ప్రమీల, పరిమళ, నరసింహులు, ప్రసాద్, సుదర్శన్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దబిడికి అభివృద్ధికి ప్రతిపాదనలు

సంబేపల్లె, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబిడికి అభివృద్ధికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రతిపాదనలు పంపారని బంజారా నాయకుడు జయరాం అఖండనాయక్ సోమవారం తెలిపారు. ఈ ప్రతిపాదనల్లో పంచాయతీ భవనం, కమ్యూనిటీ హాలు, శ్మశాన వాటిక, ప్రభుత్వ ఆసుపత్రి, ఉపరితల నీటి ట్యాంక్ ఏర్పాటు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## శివాలయాల్లో కార్తీక శోభ

గాలివీడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గం డిమడుగు ఉమా మహేశ్వర స్వామి ఆల యం కార్తీకమాసం రెండో సోమవారం భక్తులతో కిటకిటలా డింది. తెల్లవారు జా మునే మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళ లు ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు.

**రామాపురం:**మండలంలోశివాలయాలు దీపకాంతులతో కళకళలాడాయి.

**ఓబులవారిపల్లె:** బొమ్మవరం కమ్మపల్లెలోని గోకర్ణేశ్వరస్వామి ఆలయంలో అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి పూజలు నిర్వహించారు.

**చిట్వేలి:** శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో అమ్మవారికి రుద్రాక్షలతో అలంకారం చేశారు. భద్రకాళి సమేత వీరభద్రకాళి ఆలయంలో దేవతామూర్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

**రైల్వేకోడూరు(రూరల్):** పట్టణంలోని భుజంగేశ్వర ఆలయంలో శివపార్వతులకు తెల్లవారుజామున అభిషేకాలు చేశారు. ఆలయ మండపంలో శివుడికి అర్ధనారీశ్వర అలంకారం చేశారు.

**సిద్దవటం:**నిత్యపూజేశ్వరకోన, కపర్తీశ్వరకోన, సిద్దవటేశ్వరస్వామి, సిద్దేశ్వర క్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

**పెనగలూరు:** నయనాదీశ్వర ఆలయంలోని శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

పుల్లంపేట: మండల పరిధిలోని టి.కమ్మపల్లె పంచాయతీ కృష్ణంపల్లెలో గ్రామస్థులు, పాఠశాల కమిటీ సభ్యులతో సోమవారం కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పుల్లంగేరు సమీపంలో గ్రామస్థులు శివపార్వతులకు, విద్యార్థులు సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అందరూ కలిసి మొక్కలు నాటారు.

# హరికథే.. జీవనం

**● దేశవ్యాప్తంగా 10,623 సార్లు హరికథాగానం ● హరికథకు జీవం పోస్తున్న యడవల్లి రమణయ్య భాగవతార్**

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆయన హరికథ చెబితే మైమరచి పోవాల్సిందే. మధ్య మధ్యలో ఆయన చెప్పే పిట్టకథలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయి. 40 ఏళ్లుగా పదివేల సార్లకు పైగా హరికథాగానం చేశారు. ఆయనే యడవల్లి రమణయ్య భాగవతార్. హరికథతోపాటు ఇతర కళలు నేర్చుకుని బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. రమణయ్య తండ్రి చిన్న కుళాయప్ప పగటి వేషాలు వేసేవారు. కుటుంబ పోషణకోసం కర్నూలు జిల్లా నందికొట్కూరు నుంచి దువ్వూరు మండలం మీర్జాన్‌పల్లెకు చేరుకున్నారు. చిన్నకుళాయప్పకు ఆరుగురు సంతానం కాగా రమణయ్య భాగవతార్ మూడవవారు. మూడవ తరగతి వరకే చదివిన ఆయన ఏడేళ్ల వయస్సులోనే కొండపల్లి దుర్గయ్య వద్ద సంగీతం నేర్చుకున్నారు. సినిమా పాటలు పాడుకుంటూ ఉండేవారు.


హరికథ చెబుతున్న రమణయ్య భాగవతార్ (ఫైల్)

### బహుముఖ ప్రజ్ఞాశాలి

తండ్రితోపాటు తన సోదరులు కళాకారులు కావడంతో రమణయ్యకు ఇతర కళలు త్వరగానే వంటబట్టాయి. యక్షగానం, వీధి నాటకాలు, చిన్న వయస్సులోనే ప్రదర్శించేవారు. నాటకాల్లో రామాంజనేయ యుద్ధంలో రాముడు, తులాభారంలో శ్రీకృష్ణుడు, గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడు వేషాలు వేసి నాటకాలను రక్తికట్టించారు. వీధి నాటకాల్లో అర్ధనారీశ్వరుడు, రుక్మిణి, సత్యభామ, ద్రౌపతి, రంభ వేషధారణతో ఆకట్టుకున్నారు. వీధిభాగవతం ఆడేవారు. అలాగే తబల, హార్మోనియం వాయించేవారు.

### హరికథ నేర్చుకుని..

రమణయ్యకు పాక్షికంగా అంగవైకల్యం ఉంది. ఆయన నాటకాలు, వీధి నాటకాల్లో రాణిస్తున్నా బంధువులు ఎగతాళి చేశారు. దీంతో ఆత్మాభిమానం దెబ్బతిన్న ఆయన పట్టుబట్టి నీలకంఠం భాగవతార్ వద్ద 1981లో హరికథ నేర్చుకున్నారు. ఆ తర్వాత మచిలీపట్నం తరగటూరు ఆంజనేయులు దాసు వద్ద హరికథలో మరిన్ని మెలకువలు నేర్చుకున్నారు. 1982 నుంచి ఆలిండియా రేడియోలో హరికథలు చెబుతున్నారు. సతీతులసి, జలంధర, భూకైలాస్, భక్త మార్కండేయ, గజేంద్రమోక్షం, భక్తమయూర ధ్వయం, భక్తచంద్రహాస, పద్మవ్యూహం, నర్తనశాల, ఉత్తరగోగ్రహణం, శ్రీకృష్ణ రాయబారం, ధర్మరాజు అశ్వమేధయాగం, శ్రీనివాస కల్యాణం, సీతారామ కల్యాణం, శ్రీరామ జననం, భక్త అన్నమయ్య, మహాభక్త రామవిజయం హరికథలు చెప్పడంతో ప్రసిద్ధి చెందారు. రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో తిరిగి హరికథలు చెబుతూ హరికథకు ప్రాణం పోస్తున్నారు. 12 ఏళ్ల వయస్సులో హరికథను చెప్పడం ప్రారంభించి 42 సంవత్సరాలుగా హరికథే శ్వాస, ధ్యాసగా జీవిస్తున్నారు. ఇప్పటి వరకు 10,623 సార్లు హరికథ చెప్పారు. హరికథ ద్వారా వచ్చే చదివింపులను వివిధ ఆలయాలకు విరాళంగా అందజేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో దాతల సహకారంతో ఆలయాలను నిర్మించడానికి, పాడుబడిన ఆలయాలను పునర్నిర్మించడానికి కృషి చేశారు.

### సత్కారాలు ఎన్నో..

రమణయ్య హరికథకు మెచ్చి సత్కరించిన ప్రముఖులు ఎందరో ఉన్నారు. ఆయన పొందిన అవార్డులు, రివార్డులు, సత్కారాలు ఎన్నో. మైసూరు గణపతి సచ్చినందస్వామి, మైసూరు విజయేంద్ర సరస్వతి, మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆలయ పీఠాధిపతి, సుబుదేంద్రస్వామి వంటి ప్రముఖులతో సత్కారాలు పొందారు. ఆయన హరికథ ప్రతిభను గుర్తించి ఢిల్లీలోని మనం ఫౌండేషన్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కళాకారులు బాధలు తెలిసిన రమణయ్య భాగవతార్ సాటి కళాకారులను ప్రోత్సహించడానికి అన్నమయ్య కళాపీఠం స్థాపించి సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సహకారంతో దాదాపు వెయ్యిమంది కళాకారులను ఘనంగా సత్కరించారు. 50 మంది పేద జంటలకు వివాహాలు చేశారు. హరికథను బతికించడానికి ముగ్గురు మహిళలకు హరికథ నేర్పించారు. అన్నమయ్య కళాపీఠం ద్వారా అన్నమయ్య సంకీర్తనలు నేర్పించారు.



**కళలను ప్రభుత్వం ఆదరించాలి**

**- రమణయ్య భాగవతార్**

నాడు ప్రజలను చైతన్యం చేసి దశ, దిశ చూపిన కళలు నేడు ఆదరణ లేక కనుమరుగు అవుతున్నాయి. ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి. క్రీడలను ప్రోత్సహించినట్లుగానే కళలను ప్రోత్సహించాలి. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగానే మన రాష్ట్ర ప్రభుత్వం పథకాల ప్రచారానికి కళాకారులను ఉపయోగించుకుని వేతనాలు చెల్లించాలి. కళలు అంతరించిపోకుండా ప్రాచీన కళలను విద్యార్థులకు పాఠ్యాంశాలుగా బోధించాలి.

## ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలి

**కలెక్టర్ చామకూరి శ్రీధర్**


నియామకపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలు, మోడల్ పాఠశాలలకు నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని వివిధ కేజీబీవీ పాఠశాలలు, మోడల్ పాఠశాలలకు నూతనంగా ఎంపికైన సీఆర్‌టీలు, ప్రధానోపాధ్యాయులు, పార్ట్‌టైం ఉపాధ్యాయులకు నియామకపత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తారని, వారి కృషి, ప్రోత్సాహం ద్వారా యువత సరైన మార్గంలో నడుస్తుందని తెలిపారు. జిల్లాలో నూతనంగా ఎంపికైన సీఆర్టీలు, ప్రధానోపాధ్యాయులు, పార్ట్‌టైం ఉపాధ్యాయులు మొత్తం 30 మంది ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు అవగాహన సదస్సు

మదనపల్లె టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ నేర పరిశోధన విభాగం (సీఐడీ) ఆధ్వర్యంలో బుధవారం మదనపల్లెలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తిరుపతి సీఐడీ డీఎస్పీ పద్మలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ సదస్సుకు ప్రజలు హాజరు కావాలని ఆమె కోరారు.

# కురబలకోటలో సైకో వీరంగం

**● చిన్నారులపై దాడి**
**● దేహశుద్ధి చేసిన స్థానికులు**



పోలీసు జీపును అడ్డుకుంటున్న గ్రామస్తులు, పోలీసుల అదుపులో నరసింహారెడ్డి

కురబలకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అభం..శుభం తెలియని చిన్నారులపై సైకో వీరంగం చేసి గాయపరిచిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు... మండలంలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులపై సైకోగా మారిన మతిస్థిమితం లేని వ్యక్తి దాడి చేశాడు. పాఠశాలలో చదువుతున్న చిన్నారులు మూత్ర విసర్జన చేయడానికి స్కూల్ నుంచి బయటకు వచ్చిన రెండో తరగతి చదువుతున్న విద్యార్థినిపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో గట్టిగా కేకలు వేయడంతో మరో నలుగురు చిన్నారులు అక్కడికి వెళ్లగా వారిపైనా దాడి చేయడంతో స్వల్పంగా గాయపడ్డారు. దీంతో సైకో అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చిన్నారులను వెంటబెట్టుకుని వెళ్లి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఇతను తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ కొప్పలవారిపల్లెకు చెందిన నరసింహారెడ్డిగా గుర్తించారు. కాగా వారం రోజులుగా గ్రామంలో తిరుగుతూ గ్రామస్తులు పెట్టే భోజనం తింటూ ఉండేవాడు. రాత్రివేళలో గ్రామ సమీపంలో నిద్రించేవాడు. ఈ క్రమంలో చిన్నారులపై దాడి చేసి గాయపరచడంతో కోపోద్రిక్తులై అతడిని దేహశుద్ధి చేశారు. విషయం పోలీసులకు తెలియడంతో అక్కడికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ముగిసిన అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలు



ప్రథమస్థానం సాధించిన శ్రీకాకుళం జట్టుతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బృందం, రెండో స్థానం సాధించిన కడప జిల్లా జట్టు

**● విజేతగా నిలిచిన శ్రీకాకుళం, కడప జట్టు ద్వితీయ స్థానం**

రైల్వేకోడూరు (రూరల్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మండలంలోని బుడుగుంటపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అండర్-19 బాలికల హ్యాండ్‌బాల్ పోటీలలో శ్రీకాకుళం జిల్లా ప్రథమ బహుమతి సాధించిందని కడప జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.శారద తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా జట్టు రెండవ స్థానం, పశ్చిమ గోదావరి జిల్లా జట్టు మూడో స్థానం దక్కించుకున్నారని ఆమె తెలిపారు. ఎంపికైన జట్లు డిసెంబరు 11 నుంచి 17వ తేదీ వరకు పంజాబ్‌లోని లుధియానాలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సోమవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.విజయప్రసాద్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.చంద్రమోహన్ రాజు, టోర్నమెంట్ అబ్జర్వర్ విజయకుమార్ బుడుగుంటపల్లె సర్పంచ్ చంద్రశేఖర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చంగల్‌రెడ్డి, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఇళ్ల జియో ట్యాగ్‌లో పురోగతి సాధించాలి

**విద్యార్థులకు అపార్ ఐడీలు త్వరితగతిన జనరేట్ చేయాలి : కలెక్టర్ చామకూరి శ్రీధర్**

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఇళ్ల జియో ట్యాగింగ్‌లో పురోగతి సాధించాలని, విద్యార్థులకు త్వరితగతిన జనరేట్ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు.

సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, ఆర్డీవోలు జిల్లా అధికారులు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో పీజీఆర్ఎస్, ఎన్టీఆర్ హౌసింగ్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూశాఖకు సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలు గత వారంలో వెయ్యికి పైగా ఉండేవని వాటిల్లో దాదాపు 50 శాతంపైగా పరిష్కరించి మంచి పురోగతి సాధించారన్నారు. రెవెన్యూ శాఖను స్ఫూర్తిగా తీసుకుని మిగతా జిల్లా అధికారులందరూ వారి శాఖలకు సంబంధించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీల పురోగతిపై వివిధ ప్రశ్నలు అడిగి, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ ఇళ్లకు సంబంధించిన జియో ట్యాగింగ్ గురించి సమీక్షిస్తూ... హౌసింగ్‌శాఖ, ఎంపీడీవోలు సమన్వయం చేసుకుని పురోగతి సాధించాలన్నారు. విద్యార్థులకు మంజూరు చేసే అపార్ ఐడీలకు గురించి సమీక్షిస్తూ ఎంఈవోలు, ఎంపీడీవోలు సమన్వయం చేసుకుని జిల్లాలో ఈ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వాలీబాల్ జట్టుకు గాలివీడు విద్యార్థి


రాష్ట్ర జట్టుకు ఎంపికైన జస్వంత్

గాలివీడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాలీబాల్ జట్టుకు గాలివీడు విద్యార్థి చీకటి జస్వంత్ ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గాలివీడు మండలం కరిమిరెడ్డిగారిపల్లెకు చెందిన వీఆర్‌ఏ కుమార్ కుమారుడు జస్వంత్ కడప చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజులుగా విజయవాడలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ చాంపియన్‌షిప్ వాలీబాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంతో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

# యువతి ఆత్మహత్య


మృతి చెందిన బోనం నవ్య

రాజంపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వివాహం ఇష్టం లేక ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఊటుకూరుకు చెందిన వెంకటసుబ్బమ్మకు ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబ పోషణ కోసం ఆమె కువైత్‌కు వెళ్లింది. భర్త వెంకటసుబ్బయ్య ఈ మధ్యనే మృతి చెందాడు. పెద్ద కూతురుకు గతంలోనే వివాహం కాగా, చిన్నకూతురు నవ్య (24) చదువు పూర్తి కావడంతో వెంకటసుబ్బమ్మ కువైత్ నుంచి వచ్చి ఆమెకు వివాహం చేయాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం వెంకటసుబ్బమ్మ పెంచలకోనకు వెళ్లిన సమయంలో ఇంటిలో నవ్య ఉరి వేసుకుని మృతి చెందింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు రాజంపేట మన్నూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

## ప్రిన్సిపాల్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీధర్

నిమ్మనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కె.శ్రీధర్‌కు సోమవారం విజయవాడ ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ చేతు మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు గురుపూజోత్సవంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం సంతోషంగా ఉందని, మరింత పట్టుదలతో శ్రమించి కళాశాలకు మంచి పేరు తెచ్చి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

## మైనార్టీ శాఖ తరపున కరీముల్లాకు...


కరీముల్లాకు అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయుడు కేసీ కరీముల్లాఖాన్ మైనార్టీ, న్యాయశాఖామంత్రి ఎండీ ఫరూక్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో సోమవారం ఈ అవార్డు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారికి అవార్డుతో పాటు నగదు ప్రోత్సాహం ఇస్తోంది. ఇందులో భాగంగానే కరీముల్లాకు రూ.10 వేలు చెక్కు, జ్ఞాపిక, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యప్రసాద్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, వివిధ జిల్లాలకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయులు, భాషాభిమానులు పాల్గొన్నారు.

# కంచే చేను మేస్తే...

**● కురబలకోట రెవెన్యూలో భూబాగోతం**
**● డీకేటీ భూమిని భర్త పేరుతో మార్చేసిన రెవెన్యూ ఉద్యోగి**


పిచ్చలవాండ్లపల్లె వద్ద సర్వే నెంబర్ 629 లోని భూమి

కురబలకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆమె రెవెన్యూ శాఖలో చిన్నపాటి ఉద్యోగి. రెవెన్యూకు సంబంధించిన శాఖలో పనిచేస్తుండటంతో తనను ఎవరు అడుగుతారు లే అనే ధైర్యమో లేక ఎవరికీ తెలియదనే నమ్మకమో ఏమో గానీ చక్కగా తన కార్యకలాపాలను చేసుకున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం వేరొకరి పేరుతో పట్టా మంజూరు చేసిన భూమిని గుట్టుచప్పుడు కాకుండా తన భర్త పేరు మీద వన్‌బీ హక్కును కల్పించారు. రెండెకరాలకు పైగా భూమిని కాజేయడమే కాకుండా తిరిగి భూయజమాని మీదకే గొడవకు వెళ్లారు.

కురబలకోటలో రెవెన్యూ అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. ఫైసలిస్తే చేయకూడని అడ్డమైన పనులను గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ, డీకేటీ భూములను ఇతరుల పేరు మీద మార్చి వన్‌బీ అడంగల్ హక్కును కల్పించడం నిబంధనల మేరకు చట్టరీత్యా సాధ్యం కాదు. కానీ ఇక్కడ పని చేస్తున్న అధికారులకు ఆ పనులు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిసిన ఏ మాత్రం లెక్కచేయకుండా డబ్బు ఆశతో అడ్డదిడ్డంగా పనులు చేశారు.

ఇలాంటి భూములకు భూమి హక్కును ఆన్‌లైన్ చేయడం ద్వారా కల్పించారు. పదుల సంఖ్యలో వివిధ గ్రామాల్లో భూములను ఇతరుల పేరుతో మార్పులు చేశారు. ఒకరి పేరు మీదన ఉన్న భూమిని వారికి తెలియకుండానే మరొకరి పేరున మార్చేశారు. ఈ విషయం బాధితులకు తెలిశాక అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన సమస్యను ఇంతవరకు పరిష్కరించ లేదు. కాగా ప్రాంతం, విస్తీర్ణాన్ని బట్టి రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకు డబ్బులు తీసుకున్నట్లు బహిరంగా ఆరోపణలు వినిపించడంతో పాటు పలువురు బహిరంగ ప్రదేశాల్లో చర్చించుకుంటున్నారు.

ఇంత తంతు జరిగినా తమకు ఏమి తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 629లోని 2.34ఎకరాల భూమి 1995లో గ్రామానికి చెందిన కదిరప్ప పేరు మీదన పట్టాను మంజూరు చేశారు. అయితే ఈ భూమిని కాజేయాలని రెవెన్యూలో పని చిన్నస్థాయి అధికారి పథకం పన్ని తన భర్త శంకర పేరు మీదన వన్‌బీ హక్కు కల్పించారు. దీంతో బాధితులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు.


గ్రామ-వార్డు సచివాలయ శాఖ
APGSWS AE 28424924
ఫారం -1 బి
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము, రెవెన్యూశాఖ, భూమి రికార్డుల కంప్యూటరీకరణ
భూమి యజమాన్యపు హక్కుల రికార్డు ప్రకారము (1-బి) నమూనా (ROR)
Application No ROR241102025319
Date :02/11/2024
Verified by
Certified by

శంకర్ పేరుతో మంజూరు చేసిన వన్‌బీ అడంగల్

**మాకు తెలియకుండానే పట్టా చేసుకున్నారు**



మాకు తెలియకుండానే గ్రామ వీఆర్‌ఏ భర్త శంకర పేరు మీద పట్టా చేసుకున్నారు. మా నాన్నకు 1995లో పట్టా ఇచ్చారు. అయితే ఆయన వారసత్వంగా మాకు రావాలి. కానీ నన్ను మాటమాత్రమైన అడగకుండా వేరొకరి పేరున వన్‌బీ హక్కు కల్పించారు. అంతేకాకుండా మాపై వాళ్లు దాడులకు వస్తున్నారు. అధికారులు విచారించి మాకు న్యాయం చేయాలి.

- వెంకట్రాయప్ప, భూయజమాని

**విచారించి న్యాయం చేస్తాం**

ఈ భూములకు సంబంధించి గతంలో పాసుపుస్తకాలు మంజూరు చేశారు. దీనిపై గ్రామానికి చెందిన ఆయన మాకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటాము. ఇరువర్గాలను పిలిపించి విచారిస్తాము.

- తపశ్విని, తహసీల్దార్

# తేలనున్న పశువుల లెక్క



● వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన సర్వే ● నిధులు, పథకాల రూపకల్పనకు అవకాశం

**జిల్లాలో పశువుల వివరాలు**

20వ అఖిలభారత పశుగణన సర్వే ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పశువుల వివరాలు ఇలా ఉన్నాయి. గేదెలు (నల్లజాతి పశువులు) 3,99,754, ఆవులు, ఎద్దులు 44 వేలు, మేకలు 3,80,099, గొర్రెలు 9,20,614, కోళ్లు 10 వేలు, పందులు 2,775 ఉన్నాయి.

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశుగణనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా జిల్లాలోని ప్రతి కుటుంబం, ఇంటింటికి చెందిన పశువుల వివరాలను ఇందులో నమోదు చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమిలేని కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పశుసంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు పశుగణన ఉపయోగపడుతుంది. మార్గదర్శకాలను అనుసరించి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈప్రక్రియ కొనసాగనుంది. ఇందుకు గణకులు, పర్యవేక్షకులు ఇప్పటికే ఇంటింటి సర్వేలో భాగంగా పశువుల వివరాలను నమోదు చేస్తున్నారు. తొలుత సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించడానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఉత్తర్వులు జారీ చేయగా అనివార్య కారణాలతో అది వాయిదా పడింది. దీంతో అక్టోబరు 25 నుంచి గణను ప్రారంభమైంది.

**పథకాల అమలుకు...**

జిల్లాలో వ్యవసాయ రంగం తర్వాత పశుసంవర్ధక రంగం చాలా కీలకమైంది. రాష్ట్ర స్థూల నిష్పత్తిలో ఈశాఖ నుంచి 8 నుంచి 9 శాతం ఆదాయం వస్తుంది. జిల్లాలో పశుపోషణపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 1.80 లక్షలపాడి కలిగిన రైతులు ఉన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలకు కొత్తగా చేపట్టనున్న పశుగణన దోహదపడుతుంది. నాలుగు నెలలుగా పైగా చేపట్టనున్న ఈ గణనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ రూపొందించింది.

పశుసంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన, అమలు పర్యవేక్షణకు ఈ గణన ఉపయోగపడుతుంది. గేదెలు, ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు, పందులు, ఇతర పెంపుడు జంతువులు అయిన కోళ్లు, పక్షులు, పావురాళ్లు, చిలుకలు, గుర్రాలు, టర్కీ కోళ్లు తదితరవి కలిపి మొత్తం 16 రకాల గణన చేస్తున్నారు.



ఇంటింటి పశుగణన చేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది

**726 రెవెన్యూ గ్రామాల్లో....**

కడప జిల్లాలో 36 మండలాల్లో ఉన్న 726 రెవెన్యూ గ్రామాల్లోని 557 గ్రామ పంచాయతీల్లో ఇంటింటి పశుగణన ప్రారంభించారు. ఇందులో 236 మంది ఎన్యుమరేటర్లు, 72 మంది సూపర్‌వైజర్లతోపాటు పశువర్ధక సహాయకులు, సిబ్బంది పాల్గొంటున్నారు. పశువైద్యాధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. ఈ ప్రక్రియను జిల్లా అధికారులు, పర్యవేక్షకులు ఆయా వివరాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పశుగణనపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ మాట్లాడుతూ పశుగణనపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ఆకస్మిక తనిఖీలు చేసి సెన్సెస్‌లు తీసే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఆరోగ్య సమస్యలు నుంచి పశువులను కాపాడుటకు సూచనలు జారీ చేస్తున్నామన్నారు. అనుకున్న లక్ష్యానికి 15 రోజుల ముందే ఈ గణన ప్రక్రియ పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నట్లు ఆమె వివరించారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి : యూటీఎఫ్



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేశ్‌బాబు కోరారు. సోమవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాల విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని దానిని తిరిగి పునర్నిర్మించే పని ఈప్రభుత్వం చేస్తుందని ఉపాధ్యాయులు భావిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి చాలా తక్కువ నిధులు కేటాయించడం తీవ్ర నిరాశపరిచిందన్నారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి నిధులు అధికంగా కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో యూటీ ఎఫ్ నాయకులు క్రిష్టారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులను నిరాశపరిచిన బడ్జెట్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర బడ్జెట్ ఉద్యోగులను నిరాశపరిచిందని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగు బకాయిలు చెల్లి ంపు విధానంపై బడ్జెట్‌లో చూపించలేక పోవడం జరిగిందన్నారు. పీఆర్సీ గడువు ముగిసి 16 నెలలు గడుస్తున్నా ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదిశాతం మేర పాఠశాల విద్యకు బడ్జెట్ కేటాయించడం సంతృప్తి నిచ్చిందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నరసింహులు (ఫైల్‌ఫొటో)

దువ్వూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం జిల్లేళ్ల గ్రామ సమీపంలోని రెస్ట్‌హౌస్ దగ్గర ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లూరి నరసింహులు (37) మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. దువ్వూరు నుంచి జిల్లేళ్లకు బైక్‌పై ముగ్గురు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం స్కూటర్‌ను వెనుకవైపు నుంచి వచ్చి ఢీకొంది. వెంటనే 108 వాహనంలో వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నరసింహులు మృతి చెందాడు. మృతుని బావ అరవిందకుమార్, తండ్రి నరసింహులు గాయపడగా వీరిని ఆస్పత్రిలో చేర్పించారు. దువ్వూరు పోలీసులు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## పొలం విషయమై ఘర్షణ.. ఇద్దరికి గాయాలు



గాయపడ్డ రామసుబ్బమ్మ

లింగాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లెలో సోమవారం పొలం విషయమై జరిగిన ఘర్షణలో బోనాసి బాబు, బోనాసి రామసుబ్బమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ మధుసూదన్‌రావు వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నేర్జాంపల్లె గ్రామ పొలంలో బోనాసి రామసుబ్బమ్మకు, బోనాసి సరస్వతమ్మకు భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి ఆరేళ్లుగా ఇరు కుటుంబాలకు మనస్పర్థలు ఉన్నాయి. గత మేనెలలో రామసుబ్బమ్మ తన పొలంలో రెండువేల అరటిమొక్కలను నాటగా సరస్వతమ్మ అల్లుడు మన్నెల శ్రీనివాసులు సుమారు 1200 మొక్కలను ధ్వంసం చేశారు. అప్పటి నుంచి సమస్య ముదురుతూ వచ్చింది. ఆ సమయంలో యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాసులుపై కేసు కూడా నమోదు చేశారు. సోమవారం పార్నపల్లెలో బోనాసి బాబు తన కుమారుడిని స్కూల్‌కు తీసుకెళ్తుండగా అతనిపై మన్నెల శ్రీనివాసులు, మన్నెల కుమారి, మన్నెల సింధు దాడి చేశారు. బాబు తల్లి రామసుబ్బమ్మ అక్కడకు చేరుకోగా ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు వెల్లడించారు.

## మద్యం మత్తులో ఘర్షణ - కేసు నమోదు

మైలవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మాట మాట పెరిగడంతో సోమవారం ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. దీంతో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు తలమంచిపట్నం ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మండల పరిధిలోని మాధవాపురం గ్రామంలో ఆదివారం రాత్రి ఓబయ్య, కొండయ్యతోపాటు నాగమహేష్, నాగేంద్రప్రసాద్ మరో ఇద్దరు మద్యం మత్తులో మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంపై ఓ వర్గానికి చెందిన వారు విమర్శించడంతో మరో వర్గం వారు ప్రభుత్వం బాగా చేస్తోందని వాగ్వాదానికి దిగా రు. మాట మాట పెరగడంతో మద్యం మత్తులో ఘర్షణ పడ్డారు.

## చికిత్సా పొందుతూ వివాహిత మృతి

కడప(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మోడమీదపల్లికి చెందిన అఖిల(25) అనే వివాహిత నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. మోడమీదపల్లికి చెందిన అఖిలకు మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన నాగకేశవతో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. గత కొన్ని రోజుల నుంచి ఆరోగ్య సమస్యలతో మనోవేదనకు గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. బంధువులు గమనించి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

## ప్రేమించి పెళ్లి చేసుకోకపోవడంతో..

కడప(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం గుండె అంజలి (25) అనే యువతి మృతి చెందినట్లు ఒన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. సుండుపల్లెకు చెందిన అంజలి కడప నాగరాజుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేసేది. అక్కడే పనిచేస్తున్న భానుప్రసాద్ చేస్తుండగా ఇరువురు ప్రేమించుకున్నారు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని యువతి అడగడంతో భానుప్రసాద్ ఒప్పుకోలేదు. దీంతో మనస్థాపం చెంది ఈనెల 6వ తేదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఇద్దరు బాలికలు అదృశ్యం

కడప(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసు స్టేష న్ పరిధిలో ఇరువురు విద్యార్థినులు అదృశ్యమైనట్లు సీఐ వెంకటేశర్లు తెలిపారు. బాలజీనగర్‌కు చెందిన బాలిక, కాగితాలపెంటకు చెందిన బాలిక ప్రైవేట్ స్కూ ల్‌లో 8వ తరగతి చదువుతున్నారు. సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లి ఎదురుగా ఉన్న షాపులో దోశ తినేందుకు వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## అత్యంత కీలకం భూగర్భజల అధ్యయనం : వీసీ




మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ క్రిష్టారెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూగర్భజల అధ్య యనానికి అత్యంత ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరం ఉందని వైస్‌చా న్సలర్ కె.క్రిష్టారెడ్డి అన్నారు. సోమవారం వైవీయూలో భూగర్భ నీటి వనరుల సుస్థిరత, నిర్వహణపై మూడు రోజులు జరిగే శిక్షణ తరగ తులను వైస్‌చాన్సలర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ రాను రాను వర్షపాతం తగ్గుతుందని.. భూగర్భజలాలు అడు గంటుతాయని.. ఇప్పుడు ఆలోచించకపోతే భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. భూగర్భజల అధ్యయనం క్లౌడ్ కంప్యూ టింగ్ వంటి కోర్సులకు మంచి అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశా రు. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజనల్ డైరెక్టరు క్రిష్ణమూర్తి మాట్లాడుతూ రాయలసీమలో భూగర్భ జల సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాము ఇవ్వబోయే శిక్షణ ద్వారా భూమిలో ఖనిజ లవణాల గురించి నేటితరం అవగాహన పొందుతుందన్నారు. తద్వారా భూమిలో నిల్వలు ఎంత ప్రయోజనకరమైనవో తెలుస్తుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డిలు మాట్లాడుతూ కరువుప్రాంతాల్లో భూగర్భజలాలు పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎర్త్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసరు శివప్రతాప్, జియాలజీ విభాగాధిపతి రవిబాబు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహనతోనే నవసమాజ నిర్మాణం




మాట్లాడుతున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

కడప(వినాయకనగర్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన పెంచుకున్నపుడే చైతన్యంతో పాటు నవసమాజ నిర్మాణం జరుగుతుందని కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్ తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో సీఐడీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అఘాయిత్యాల నివారణపై చైతన్య సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకున్నపుడే న్యాయం జరుగుతుందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. మున్సిపల్ అదనపు కమిషనర్ రాకేశ్‌చంద్రం మాట్లాడుతూ సమానత్వం, కులవివక్ష నిర్మూలించడానికి ప్రవేశపెట్టిన సివిల్‌రైట్స్ యాక్ట్ ప్రకారం వివక్ష తగ్గిందన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలాజీ ఎస్సీ, ఎస్టీ చట్టాలు, నియమ నిబంధనల గురించి తెలిపారు. సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ వివేకానంద మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు, మార్గదర్శకాలు రుణాల గురించి తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ డీఎస్పీ పద్మలత, దిశా పోలీస్‌స్టేషన్ సీఐ క్రిష్టారెడ్డి, సీఐడీ అధికారులు బాబాపక్రుద్దీన్, శ్రీనివాసులరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంత మంది విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు.

## విభిన్న ప్రతిభావంతులకు చట్టపరమైన సేవలు

● సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్




మాట్లాడుతున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలు విభిన్న ప్రతిభావంతులకు చట్టపరమైన సేవలను అందిస్తాయని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ తెలిపారు. కడప నగరం రామాంజనేయపురంలోని హెలెన్ కెల్లర్ ప్రత్యేకపాఠశాల, జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం, మానసిక వికలాంగులకు చట్టపరమైన సేవల పథకం, విభిన్న ప్రతిభావంతుల పిల్లల కోసం న్యాయసేవల పథకం, లీగల్ సర్వీసెస్ టోల్‌ఫ్రీ నెంబర్ 15100పై వివరించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల డిపార్ట్‌మెంట్ అధికారులు, వైద్యశాఖ అధికారులు సంయుక్తంగా మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి వైద్యాధికారుల చేత ఆడియో మెట్రీషన్ టెస్టులు నిర్వహిం చి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం జడ్జి బాబాపక్రుద్దీన్ 10 మంది పిల్లలకు హియరింగ్ మిషన్స్‌ను అందజేశారు. సోమవారం పురుషులు, మహిళల కేంద్ర కారాగారాలను జడ్జి విజిట్‌చేసి న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాలలో ట్రైనీ జడ్జిలు జె.నందిని, ఖాజామొహిద్దీన్, ఎం.అనిల్‌కుమార్ నాయక్, ఎం.ఆశాప్రియా, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



ఏసీఏ మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ నవంబర్ 11, (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్ రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లు సోమవారం డ్రాగా ముగిశాయి. వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు-విజయనగరం జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విజయనగరం జట్టు 80.3 ఓవర్లలో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 250 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు రెండవ రోజు 84 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో నెల్లూరు జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 10 పరుగుల ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన విజయనగరం జట్టు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలాగే కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం-క్రిష్ణా జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 322 పరుగులు భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన క్రిష్ణా జట్టు 63.4 ఓవర్లలో 247 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కేఎస్ఆర్ఎం మైదానంలో శ్రీకాకుళం-గుంటూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. తదుపరి శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53.3 ఓవర్లలో కేవలం 139 పరుగులకే చేతులెత్తేసింది. రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

## ఫిర్యాదులపై తక్షణం స్పందించి న్యాయం చేయాలి

● జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు

కడప క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

## జాతీయ వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు మొదలు పెట్టిన సమయం నుంచి లబ్ధిదారులకు అందే వరకు సరైన ఉష్ణోగ్రత ఉండేట్లు చూడాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు ఇచ్చిన సమయంలో టీకాల వల్ల దుష్పరిణామాలు ఏమైనా వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిపోర్టింగ్ విషయాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు మరియు ప్రాథమిక పట్టణ వైద్యాధికారులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై అల్లరిమూక దాడి

వేంపల్లె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప రోడ్డులో అలిరెడిపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డిపై అల్లరిమూక దాడికి తెగపడింది. నడిరోడ్డుపై ఘర్షణ పడటంతో దారిన వెళ్లే వారు బయాం దోళ నకు గురయ్యారు. ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ అక్కడికి చేరుకుని అల్లరి మూకను తరిమి కొట్టారు. గాయపడ్డ శ్రీకాంత్‌రెడ్డిని చికిత్స నిమిత్తం కడపకు పంపించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఈ సందర్భంగా ఎస్‌ఐ తెలిపారు.

## అలరించిన మహిళల కోలాట ప్రదర్శన

రాయచోటిటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం సంద ర్భంగా రాయచోటి పట్టణంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో కో లాటం మాస్టర్ తుమ్మల హరినాథ్ ఆధ్వ ర్యంలో రాయచోటిలోని లక్ష్మీపురం మహిళ లు ప్రదర్శించిన కోలాటం కార్యక్రమం భక్తులను అలరించింది. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



# దేశసేవ లక్ష్యంగా పరుగు

● రెండోరోజు కొనసాగిన ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ



అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఆర్మీ అధికారి



అభ్యర్థులకు లాంగ్ జంప్ నిర్వహిస్తున్న ఆర్మీ అధికారులు

కడప స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ మైదానంలో అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ రెండోరోజు సోమవారం కొనసాగింది. జన్మనిచ్చిన మాతృదేశానికి సైనికులుగా సేవలందించాలనే లక్ష్యంతో ఆర్మీ రిక్రూట్‌మెంటుకు వచ్చిన యువకులు రెట్టించిన ఉత్సాహంతో పరుగుపందెంలో పాల్గొన్నారు. ఆ మేరకు రెండోరోజు పరుగుపందెంతో పాటు జిగ్ జాగ్ బ్యాలెన్స్, పుల్లప్స్, హైజంప్, లాంగ్‌జంప్ తదితర పోటీలను ఆర్మీ అధికారులు నిర్వహించారు. ఇందులో క్వాలిఫై అయిన వారికి ఆ వెంటనే మెడికల్ టెస్ట్ నిర్వహించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్‌ఆధ్వర్యంలో ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. రోజువారీగా 800 మంది అభ్యర్థులను టెస్టులకు సిద్ధం చేస్తున్నారు. ఆకోవలో సోమవారం కర్నూలు, చిత్తూరు జిల్లాకు చెందిన అభ్యర్థులకు పోటీలు నిర్వహించారు.

## సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

నిమ్మనపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకొని టీడీపీ అందించే ప్రయోజనాలు పొందాలని మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ కో-ఆప్షన్ మెంబరు సుధాకర్‌రావు, రాజంపేట అధికార ప్రతినిధి ఆర్డీ వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిరత్నం, విజయ్, గోపి, చెంగ్రాయుడు, రాజన్న, రామచంద్ర, శ్రీనివాసులు, జగన్‌మోహన్ రెడ్డి, శ్రీపతి, శంకర, సూర్యప్రకాష్, గోపాలక్రిష్ణ, శ్రీనివాసులు, మల్లికార్జున, జయన్న తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల ఆత్మీయసభను విజయవంతం చేయండి

నిమ్మనపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మాదిగల ఆత్మీయసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు నరేంద్ర మాదిగ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న మదనపల్లిలోని చౌడేశ్వరీ కల్యాణ మండపంలో జరిగే మాదిగల ఆత్మీయసదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగలు వాసుదేవరావు, రెడ్డినారాయణ, గణేష్, రెడ్డెప్ప, వెంకటేష్, శ్రీనావాస్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 200 మందికి వైద్య పరీక్షలు

తంబళ్లపల్లె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె పాత కళాశాల మైదానంలో మదనపల్లె సాయి సంజీవని కిడ్నీ స్టోన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు, వృద్ధులు, రోగులు ఉచిత వైద్య శిబిరానికి హాజరయ్యారు. వీరికి వైద్యులు మంజునాథ్, శ్వేతారెడ్డిలు అల్ట్రాసౌండ్ స్కానింగ్, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది వసంత్ పాల్గొన్నారు.

## వీఆర్వోల సమీక్ష సమావేశం

మదనపల్లె అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత మీదే అన్నారు. కార్యక్రమంలో డీటీ అస్లాం, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం వడ్డించాలి : సీడీపీవో

పీలేరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం వడ్డించాలని సీడీపీవో సిబ్బందికి సూచించారు. సోమవారం పీలేరులో అంగన్వాడీ హెల్పర్స్‌కు ప్రీస్కూల్‌పై అవగాహన కల్పించారు. పిల్లలు కేంద్రాలకు హాజరయ్యేలా సిబ్బంది పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు అయ్యప్పస్వామి పూజ

వాల్మీకిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం పెద్ద పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గురుస్వాములు రామచంద్ర, శీనా, బలరామ్‌లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఆలయంలో అయ్యప్పస్వామికి అభిషేకం, అర్చన, హోమాది కార్యక్రమాలతో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలతో మాల ధరించిన అయ్యప్ప భక్తుల నగరోత్సవం, సాయంత్రం ఆలయంలో అంబలం పూజా కార్యక్రమాలు, భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో గౌరీవ్రతం

తంబళ్లపల్లె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రెండో కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర గౌరీవ్రతాన్ని ఆచరించి నోములు నోచుకున్నారు. అర్చకులు మహేష్ స్వామి వ్రత మహత్యాన్ని భక్తులకు చదివి వినిపించారు. భక్తుల పేరిట పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# ఆలయాలకు పోటెత్తిన భక్తులు





పీటీఎం శివాలయంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం, ప్రత్యేక అలంకరణలో కలకడ సిద్దేశ్వరుడు, పూజలందుకుంటున్న కేథారేశ్వరుడు

● శివనామస్మరణలో భక్తులు

కలకడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కలకడ సత్యవతి నది ఒడ్డున కొలువైన కామాక్షి సమేత సిద్దేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. రెండవ కార్తీక సోమవారం కావడంతో కేథారేశ్వర నోముల వత్రాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొని గౌవరమ్మకు పూజలు చేశారు. అర్చకులు సుబ్రమణ్యం స్వామి వేకువజామునే స్వామి అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులతో ఆలయ ప్రాంగణం శివనామంతో మారుమ్రోగింది. అలాగే అధిక సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

**పెద్దతిప్పసముద్రం:** మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కార్తీక మాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని పీటీఎంకు ఆధ్యాత్మిక వేత్త పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ, రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేదపండితులు వేణుగోపాలశర్మ, సత్యనారాయణశర్మ, ఎంఎస్ శేషాచలంశర్మలు వైభవంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**వాల్మీకిపురం:** మండల వ్యాప్తంగా సోమవారం గౌరీకేథారేశ్వర వ్రత వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. స్థానిక కోనేటివీధిలోని శివాలయం, పడమర పొలిమేరల్లోని ధర్మపథం, ఏటి గడ్డ శివాలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. విశేష సంఖ్యలో హాజరైన భక్తజనం నోములు చెల్లించి మొక్కులు తీర్చుకుంటూ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలలో అర్చకులు వ్రత విశిష్టతను భక్తులకు తెలియజేశారు. హోమాది కార్యక్రమాలు పూర్తి చేసి భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గోనవరపు శీనాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

## 'భూకబ్జాదారులను శిక్షించండి'



ఆర్డీవో రాఘవేంద్రకు అర్జీ ఇస్తున్న ప్రజలు

మదనపల్లెటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పేదల పేరిట వున్న డీకేటీ భూములను కబ్జా చేసిన వైసీపీ నాయకులపై ల్యాండ్ గ్రాబింగ్ చట్ట ప్రకారం శిక్షించాలని బాధితులు విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి ఆర్డీవో రాఘవేంద్ర ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా రామసముద్రం మండలం కొత్తిండుకు చెందిన కదిరప్ప మాట్లాడుతూ తన తండ్రి వెంకటప్పకు ప్రభుత్వం డీకేటీ పట్టా ఇవ్వగా దాన్ని చదును చేసి మామిడిచెట్లు నాటామన్నారు. ఈ పట్టాను అప్పట్లో రామసముద్రం తహసీల్దార్, నారిగానిపల్లె వీఆర్‌వో, వీఆర్‌ఏలపై ఒత్తిడి తెచ్చి వైసీపీ నాయకుడు అక్రమంగా బదిలీ చేయించారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని కదిరప్ప విన్నవించాడు. అలాగే భూ వివాదాలు, సర్వే సమస్యలపై ప్రజలు ఆర్డీవోకు అర్జీలు అందజేశారు.

## యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మదనపల్లెటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన యువజనోత్సవాల్లో మదనపల్లె శ్రీనివాస డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని కరస్పాండెంట్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యువజనోత్సవాల్లో తమ కళాశాలకు చెందిన ఇమ్రాన్ స్పాట్ ఫోటోగ్రఫీలో, పోస్టర్ మేకింగ్‌లో ఎస్.కె. అసీఫాఅంజుమ్ ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. అలాగే ఎస్.కె.అసీఫాఅంజుమ్, కె.హరిత, ఎస్.రిషిక, ఎస్.గీత, రెడ్డిమానస బృందం, కృషంనాయుడు టీమ్ ప్రథమ బహుమతి సాధించారన్నారు. వై.మౌనిక, బియోశిత, సి.కల్పన, ఎం.లోహిత ద్వితీయ బహుమతి, మైమ్‌లో కె.అభిలాష్, జి.మనోజ్, కె.వెంకటేశర్లు, సి.సుధాకర్ బృందం ద్వితీయ బహుమతి సాధించారన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను సీటీఎం స్వామి, ప్రిన్సిపాల్ బి.వి.రమణాచారి, వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

## దేశంలో కులగణనతో చిచ్చు : బీజేపీ

మదనపల్లె అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో కాంగ్రెస్ పార్టీ కులగణనలతో మతాల, కులాల మధ్య రాజకీయ లబ్ధికోసం చిచ్చు పెడుతోందని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గోపిశ్రీనివాస్ అన్నారు. సోమవారం మదనపల్లెకు చెందిన ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మక్కినేని వేణుగోపాల్ అకస్మాత్తుగా మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మదనపల్లెకు విచ్చేసిన ఆయన స్థానిక బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీకి వేణుగోపాల్ మరణం తీరని లోటన్నారు. కులాలకు సంబంధించిన లెక్కలు ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణలో భాగంగా కులగణను చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పడం శోచనీయమన్నారు. దేశంలో బీజేపీ సమగ్రాభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు మురళీ నాయుడు, రేపన శివప్రసాద్, చంద్రశేఖర్, పులి నరేంద్ర, భగవాన్, బండిఆనంద్, మదనపల్లె మండల రూరల్ అధ్యక్షుడు పచ్చిపాల వసంతకుమార్ పాల్గొన్నారు.

## ఒంటిమిట్టను కరువు మండలంగా ప్రకటించాలి

ఒంటిమిట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) :మండలంలో పశుగ్రాసం కొరతతో పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఒంటిమిట్ట మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం నాయకులు కట్టా యానాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీ ల్దారు రమణమ్మకు రైతులతో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. మండలంలోని చెరువుకు నీరు రాక ఆయకట్టు భూములన్నీ బీళ్లుగా తయారయ్యాయని, గ్రామాల్లో తాగునీరు కూడా కరువైందని విన్నవించారు. వెంటనే కరవు మండలంగా ప్రకటిం చాలని కోరారు.

## విద్యతోనే మైనార్టీల్లో చైతన్యం : ఎమ్మెల్యే



విజయవాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లెటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యతోనే మైనార్టీల్లో చైతన్యం తీసుకురావచ్చని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని తుమ్మవారి కళాక్షేత్రంలో మైనార్టీ సంక్షేమ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ మైనార్టీల్లో అక్షరాస్యత శాతం తక్కువగా వుందని, చదువులో రాణించాల్సిన అవసరం వుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి, భాషాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎన్ఎండీ ఫారుఖ్, సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు నసీర్‌అహ్మద్, శ్రీనివాసరావు, మైనార్టీ వ్యవహారాల సలహాదారులు ఎం.ఎ.షరీఫ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాఖ్‌అహ్మద్, ముస్లీం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారుఖ్ షిబ్లీ, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధిని విస్మరించారు: సీపీఎం

మదనపల్లెఅర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని విస్మరించేలా రాష్ట్ర బడ్జెట్ విడుదల చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో కనీసం ప్రస్తావన చేయకుండా బడ్జెట్ ప్రసంగం ఆత్మస్తుతి పరనిందతో నిండిపోయిందన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్ పూర్తి రాజకీయ పత్రంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు నిర్దిష్టంగా కలిగే ప్రయోజనాల గురించి ప్రస్తావనే లేదని విమర్శించారు. సూపర్ సిక్స్‌లో అమలైన పథకాలను వివరించారే తప్ప మిగిలిన పథకాలు ప్రస్తావనే లేదన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్ గురించి జాడేలేదన్నారు.

## 'ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి'

పీలేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన విద్యార్థి ఫెడరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దే భానుప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు ఫిర్యాదు చేశాడు. పంచాయతీ పరిధిలో విలువైన ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు ఆక్రమించుకొని లక్షలాది రూపాయలకు విక్రయించినట్లు తెలిపారు. గ్రామంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో నోముల వ్రతం

గుర్రంకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేథారేశ్వర నోముల వత్రాన్ని ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీక మాసం రెండవ సోమవారం కావడంతో మహిళలు నోముల వత్రాన్ని వేడుకగా నిర్వహించారు. నోముల వత్రం సందర్భంగా వివిధ శివాలయాల్లో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అనంతరం అర్చకులు కేథారేశ్వర వత్రం గురించి భక్తులకు వివరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

## వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

● వీఆర్‌ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వీఆర్‌ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట వాల్మీకి సంఘం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా వాల్మీకుల పిల్లల జీవితాలు, భవిష్యత్ మారలేదని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రతి ప్రభుత్వం వాల్మీకులకు హామీలు ఇవ్వడం, గెలిచిన తరువాత వారిని మోసం చేయడం పనిగా పెట్టుకున్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం తప్పకుండా చేస్తామన్న హామీలను బుట్టదాఖలు చేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి వాల్మీకులు ఎన్నికల సమయంలో పూర్తిగా మద్దతు పలికి ఓట్లు వేసి గెలిపించారని, అయితే ఏపీలో ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కాలం గడుస్తున్నా వాల్మీకుల గురించి పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పటికైనా పాలకులు అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకులు ఉద్యమాలను ఉధృతం చేయనున్నట్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర షూటింగ్‌బాల్ టోర్నమెంట్‌లో తృతీయస్థానం

మదనపల్లెఅర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించిన 7వ రాష్ట్ర షూటింగ్‌బాల్ పురుషుల ఛాంపియన్‌షిప్-2024లో భాగంగా అన్నమయ్య జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించింది. ఈ మేరకు షూటింగ్‌బాల్ జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కెప్టెన్ శ్రీకుమార్, కోచ్ అండ్ మేనేజరు యూసఫ్, మురళీలను జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోల్డెన్‌వ్యాలీ రమణారెడ్డి, ఉపాధ్యక్షులు రెడ్డిశ్రీనివాస్, సాగర్, సభ్యులు సురేష్, సాయిశేఖర్‌రెడ్డి, సయ్యద్‌బాషా, నరేష్‌బాబులు అభినందించారు.




రాష్ట్ర షూటింగ్‌బాల్ టోర్నమెంట్‌లో విజేతలు

## యంత్రాలతో ఇసుకను తోడితే కఠిన చర్యలు

● మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు



రికార్డులు తనిఖీ చేస్తున్న మదనపల్లె డీఎస్పీ

ములకలచెరువు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యంత్రాలతో ఇసుకను తోడితే కఠిన చర్యలు తీసుకుంటామని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు ఆదేశించారు. ములకలచెరువు పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని సోమవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. అక్రమ మద్యం, ఇసుక తరలింపు అరికట్టేందుకు అన్నమయ్య - శ్రీ సత్యసాయి జిల్లా సరిహద్దులో 24 గంటల చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో సీఐ రాజారమేష్, ఎస్ఐ గాయత్రి పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు

నిమ్మనపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాహుదా కాలువలు, చెరువుల నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక అక్రమరవాణా చేపడితే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని తహసీల్దార్ ధనంజేయులు హెచ్చరించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'ఇసుక ఉచితం..రవాణా అక్రమం' అనే వార్త ప్రచురితమైంది. దీనిపై ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత కొద్ది రోజుల క్రితం ఉచిత ఇసుకను ప్రవేశపెట్టిందని, అయితే మండల ప్రజలు తమ స్వప్రయోజనాల నిమిత్తం మాత్రమే ఎద్దలబండ్లు, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసుకొనేందుకు వీలుంటుందన్నారు. అలాగే మండలంలో ఎలాంటి రీచ్‌లను ప్రభుత్వం గుర్తించలేదని తెలిపారు. ఈ విషయమై గతంలోనే అన్ని గ్రామాల్లో దండోరా వేయించామని తెలిపారు. ఈ నెల 5న బాహుదా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని యజమాని అశోక్, డ్రైవర్ శ్రీకాంత్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

## దేవదాయశాఖ భూములను కాపాడండి

ములకలచెరువు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడుపల్లెలోని ఈశ్వరుని ఆలయం భూములను కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లికార్జున, బాస్ నేత మంత్రాల రమణ డిమాండ్ చేశారు. ఆలయ భూములు సంరక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రదీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణప్ప, చంద్ర, వెంకటరమణ, శ్రీనివాస్, రామచంద్ర, సుబ్బన్న, రమణమ్మ, పాపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



పనులకు భూమిపూజ చేస్తున్న అధికారులు, కూటమి నేతలు

పెద్దమండ్యం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని సీగలపల్లె పంచాయతీ రెక్కలకొండపల్లెలో రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీడీవో, ఏపీవో మురళి కూటమి నేతలతో కలసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీధర్‌రావు మాట్లాడుతూ మండలంలోని పెద్దమండ్యం, రెక్కలకొండపల్లె, దిగువపల్లె గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.28 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని, టీడీపీ హయాంలో దశల వారీగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఎస్ఐ పి.వి.రమణ, కార్యదర్శి సద్దాం, కూటమి నేతలు శివయ్య, గోర్ల సుమన్‌కుమార్, కుంటకిందపల్లె చంద్రరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, గంగాధర, మహేశ్వర, చంద్ర పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

మదనపల్లెఅర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, ఈశ్వరమ్మ కాలనీ ఆర్వీనాయుడు కాలనీకి చెందిన రెడ్డెప్ప భార్య భూదేవి(45)ఆర్థిక ఇబ్బందులతో గత నెల 31న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతి, వేలూరు ఆస్పత్రులకు తరలించి అనంతరం ఇంటికి వచ్చేశారు. తిరిగి ఆరోగ్యం విషమించగా శనివారం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



పీలేరు ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పీలేరు నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నూతన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బలస వేణుగోపాల్, కార్యదర్శిగా రేవూరి సుధీర్, కోశాధికారిగా కేసర్ల బాలసుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీగా చింతలపల్లి రాజేష్, ఉపాధ్యక్షుడిగా పామిడి మల్లికార్జున గుప్తా, 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకుని పూర్వ ప్రెసిడెంట్ కూన సత్యం అధ్యక్షతన ప్రమాణస్వీకారం చేయించారు. ఆర్యవైశ్యలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సంఘం ముందుంటుందన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు.

## ఘనంగా అబుల్‌కలాం ఆజాద్ జయంతి

బి.కొత్తకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం బి.కొత్తకోటలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిఠాయిలు పంచిపెట్టారు. పలువురు మాట్లాడుతూ భారతదేశంలో విశ్వవిద్యాలయాలు నెలకొల్పి, విద్యా సంస్కరణలతో సాంకేతిక విద్యకు బీజంవేసిన మహనీయుడు ఆజాద్ అని విద్యార్థులకు వివరించారు. నవంబర్ 11న ఆయన జయంతిని విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీను నాయక్, ఉపాధ్యాయ సిబ్బందితో పాటు హెల్పింగ్ మైండ్స్ ప్రతినిధులు ఫయాజ్, నక్కామహేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

**వాల్మీకిపురం:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి, మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను సోమవారం వాల్మీకిపురంలో ఎంతో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పాత బస్టాండులోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తూ ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో జామియా మస్జిద్ ముతవల్లి అబ్దుల్‌అజీమ్, సాదిక్, షబ్బీర్, మెకానిక్ చాను, కలందర్, యూసుఫ్, కువైట్ బాబు, డిష్ బ్రదర్, జంషీద్, రియాజ్, కలిమూ, ఫయాజ్, మురాషా, బాబు, రిజ్వాన్ పాల్గొన్నారు.

# ఘనంగా గౌరీ వ్రతనోములు




నీరుగట్టువారిపల్లెలో గౌరీనోములకు హాజరైన భక్తులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని పలు ఆలయాల్లో భక్తులు గౌరీ వ్రతనోముల పండుగను ఘనంగా నిర్వహించారు. సోమవారం ముఖ్యంగా చిప్పిలి గ్రామంలోని మడికయ్యల శివాలయంలో యోగభోగేశ్వరస్వామి దేవస్థానంలో గౌరీ నోముల వ్రత పండుగను ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వరప్రసాద్ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్ధనారీశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరణ చేసి విశేషంగా పూజలు నిర్వహించారు. అలాగే దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు ఫణీంద్ర సోమేశ్వర స్వామిని విశేషంగా అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయం చేరుకుని గౌరీవ్రత నోములు ఆచరించారు. నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త గుడి రామాంజులు నీలకంఠేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. సీటీఎం రోడ్డులోని మంజునాథ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలతో ఆలయ అర్చకుడు గౌరీ వ్రత నోములు ఆచరించారు. అన్ని ఆలయాల్లో మహిళలు తమతో పాటు తెచ్చిన నైవేద్యాన్ని స్వామివార్లకు సమర్పించారు. అన్ని ఆలయాల్లో నోములు సందర్భంగా భక్తులతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి.